వెలిగల్లులో తగ్గిన నీటి మట్టం

గాలివీడు, న్యూస్‌టుడే: వెలిగల్లు జలాశయంలో శుక్రవారం 2.31 టీఎంసీల నీటి నిల్వలున్నాయని డీఈఈ వి.శిరీష్‌కుమార్ పేర్కొన్నారు. జలాశయం గరిష్ఠ నీటి సామర్థ్యం 4.64 టీఎంసీలు కాగా, ఈ ఏడాది నీటి నిల్వలు పెరగలేదు. రాయచోటి, గాలివీడులోని తాగునీటి పథకాలకు ఆరు క్యూసెక్కులు, ఎడమ కాలువకు రెండు క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నారు. ఎగువ ప్రాంతంలో వర్షాలు కురిస్తే ప్రాజెక్టు నది నీటి ప్రవాహంతోనే జలాశయంలో నీటిమట్టం పెరుగుతుందని, ఉన్న నీటిని సద్వినియోగం చేసుకోవాలని డీఈఈ తెలిపారు.

హార్సిలీహిల్స్‌కు పురస్కారం!

సీఎం చంద్రబాబు చేతులమీదుగా అందుకున్న కలెక్టర్ శ్రీధర్

బి.కొత్తకోట, న్యూస్‌టుడే: ప్రముఖ పర్యాటక కేంద్రమైన బి.కొత్తకోట మండలం హార్సిలీహిల్స్‌కు సినిమాల చిత్రీకరణకు అనువైన ఉత్తమ ప్రాంతంగా పురస్కారం లభించింది. ప్రపంచ పర్యాటక దినోత్సవాన్ని పురస్కరించుకుని విజయవాడలోని తుమ్మలపల్లి కళాక్షేత్రంలో శుక్రవారం రాత్రి నిర్వహించిన కార్యక్రమంలో ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడి చేతులమీదుగా కలెక్టర్ చామకూరి శ్రీధర్ పురస్కారం అందుకున్నారు. ఈ మేరకు జ్ఞాపిక, ప్రశంసాపత్రం ప్రదానం చేశారు. కార్యక్రమంలో పర్యాటకశాఖ మంత్రి కందుల దుర్గేష్, పర్యాటకశాఖ అధికారులు, తదితరులు పాల్గొన్నారు.



సీఎం చంద్రబాబునాయుడి చేతులమీదుగా పురస్కారం అందుకుంటున్న కలెక్టర్ శ్రీధర్

ఈనాడు అన్నమయ్య
శనివారం సెప్టెంబరు 28, 2024

అబ్బే... మాకేం తెలియదండి!

ఫ్రీహోల్డ్ భూములపై అధికారుల దాటవేత వైఖరి
వీరబల్లి మండలంలో దాదాపుగా సగం అక్రమాలే
మైదుకూరు ప్రాంతంలోనూ 576 ఎకరాల గుర్తింపు

– ఈనాడు, కడప

గత వైకాపా ప్రభుత్వ హయాంలో సాగిన భూదందాలపై నిగ్గు తేల్చేందుకు కంకణం కట్టుకున్న ఎన్డీయే ప్రభుత్వం మొదటి అడుగుగా రాష్ట్రంలోని ఆరు మండలాలను ప్రయోగాత్మకంగా ఎంపిక చేసి విచారణ చేపట్టింది. దీంతో భారీఎత్తున అక్రమాలు వెలుగులోకి వచ్చాయి. అత్యధికంగా ఫిర్యాదులు రావడం, ఫ్రీహోల్డ్ భూములను ఎక్కువ విస్తీర్ణంలో చేయడంతో వైఎస్ఆర్ జిల్లాలో మైదుకూరు, అన్నమయ్య జిల్లాలో వీరబల్లి మండలాలను ఎంపిక చేసి సమగ్ర విచారణ చేపట్టింది. రాష్ట్రంలోని ఆరింటిలో పై రెండు మండలాలున్నాయి. మండల పరిధిలోని ఆర్డీవో, తహసీల్దారు, మండల సర్వేయర్, అసిస్టెంట్ సబ్‌రిజిస్ట్రార్లను కమిటీ సభ్యులుగా నియమించి కసరత్తు చేపట్టింది. ఈ కమిటీ క్షేత్రస్థాయిలో రెవెన్యూ దస్త్రాల ఆధారంగా శోధన చేపట్టింది. ఫ్రీహోల్డ్ భూముల ఎంపికలో నిబంధనలు పాటించారా?.. 20 ఏళ్ల అనుభవాన్ని పరిగణనలోకి తీసుకున్నారా?.. తప్పుడు లెక్కలతో నిషేధిత జాబితా నుంచి తొలగించారా?.. ఈ భూముల రిజిస్ట్రేషన్ ఎలా జరిగింది?.. తదితర అంశాలను విచారణలో పరిశీలించింది. ఫ్రీహోల్డ్ భూములతో పాటు చెరువులు, కాలువలు, పోరంబోకు, రస్తాలు, అటవీ భూముల ఆక్రమణలను పరిశీలించారు. రిజిస్ట్రేషన్లు జరిగిన వాటిల్లో విక్రయ, గిఫ్ట్‌డీడ్ పత్రాలు పరిశీలించింది. ఈ కార్యక్రమం సంయుక్త కలెక్టర్ పర్యవేక్షణలో జరిగింది. అసైన్డ్ పట్టాదారు భూములనే ఫ్రీహోల్డ్ చేశారా?.. ఇందులో అక్రమమేమైనా జరిగిందా?.. తదితర వివరాలు సేకరించింది. ఈ మేరకు భారీగానే అక్రమాలు వెలుగుచూశాయి.


బ్రహ్మంగారిమఠం వద్ద భూముల విషయమై రైతులతో మాట్లాడుతున్న బద్వేలు ఆర్డీవో చంద్రమోహన్

- మేం ఏ తప్పు చేయలేదు. మా ప్రమేయం లేకుండా ఎవరో నిషేధిత జాబితా నుంచి తొలగించారు. ఆ భూములు ఎలా ఆన్‌లైన్‌లో నమోదయ్యాయో అర్థం కావడంలేదు. **- తప్పించుకునే ఎత్తుగడలో భాగంగా బాధ్యులైన రెవెన్యూశాఖాధికారుల వాదన**
- ఫోర్జరీ సంతకాలతో ఎవరో నిషేధిత జాబితా నుంచి నిబంధనలకు వ్యతిరేకంగా భూములను తొలగించారు. మాకు ఏ మాత్రం సంబంధంలేదు. అవసరమైతే విచారణ చేసుకోండి. **- వ్యవహారాన్ని మరింత కాలం లాగే ప్రయత్నంలో భాగంగా మరి కొందరు అధికారులు ఫోర్జరీ వ్యవహారాన్ని తెరపైకి తెస్తున్నారు.**


మదనపల్లె మండలం బొమ్మనచెరువులో భూములను పరిశీలిస్తున్న మదనపల్లె సబ్‌కలెక్టర్ మేఘస్వరూప్

◆ ఫ్రీహోల్డ్ భూములు చాలా వరకు 20 ఏళ్ల అనుభవంలో లేనివాటిని తొలగింపు జాబితాలో చేర్చినట్లు తేలింది. వైకాపా నేతల అడుగుజాడల్లో పనిచేసిన పలువురు రెవెన్యూశాఖాధికారులు ఇష్టారాజ్యంగా అక్రమాలకు పాల్పడినట్లు గుర్తించారు. అక్రమాలను నిగ్గు తేల్చిన అనంతరం బాధ్యులైన అధికారులు తప్పించుకునే ఎత్తుగడలు వేస్తున్నారు. మాటలకు... దస్త్రాలకు సంబంధం ఉండదని, పూర్తి బాధ్యత వహించాల్సిందేనని ఉన్నతాధికారులు వ్యాఖ్యానిస్తున్నారు. విచారణలో గుర్తించిన అక్రమాలను రాష్ట్ర ప్రభుత్వానికి నివేదించారు. తదుపరి చర్యలు దిశగా ప్రయత్నాలు జరుగుతున్నాయి. మదనపల్లె రెవెన్యూ డివిజన్ పరిధిలో మదనపల్లె అనంతరం తంబళ్లపల్లె నియోజకవర్గంలో అత్యధికంగా అక్రమాలు చోటుచేసుకున్నట్లు తేలింది.

◆ అన్నమయ్య జిల్లా వీరబల్లి మండలంలో 4,774 ఎకరాల భూములను నిషేధిత జాబితా నుంచి తొలగించగా, వాటిల్లో 2.022 ఎకరాలు నిబంధనలకు విరుద్ధంగా తొలగించినట్లు లెక్క తేలింది.

◆ వైఎస్ఆర్ జిల్లా మైదుకూరు మండలంలో 2,788 ఎకరాలను నిషిద్ధ జాబితా నుంచి భూములను తొలగించగా, అక్కడ 576 ఎకరాల వరకు అక్రమంగా తొలగించినట్లు గుర్తించారు.

◆ మదనపల్లె రెవెన్యూ డివిజన్ పరిధిలో 22(ఎ) జాబితా నుంచి 44 వేల ఎకరాల వరకు భూములను తొలగించినట్లు తేలగా, వీటిపై చేపట్టిన విచారణలో 22 వేల ఎకరాల వరకు అక్రమంగా జరిగినట్లు తేలింది. సగం వరకు అక్రమంగా ఫ్రీహోల్డ్ చేసినట్లు గుర్తించారు.

◆ వీరబల్లి మండలంలో ఫ్రీహోల్డ్ చేసిన భూముల్లో 266 రిజిస్ట్రేషన్లు జరగ్గా, మైదుకూరు మండలంలో 320 జరిగాయి. వీటిలో విక్రయ, గిఫ్ట్ రిజిస్ట్రేషన్లు జరిగాయి.

◆ రిజిస్ట్రేషన్లు సైతం ప్రభుత్వ ఉత్తర్వుల మేరకు వీరబల్లి మండలంలో 171, నిబంధనలకు విరుద్ధంగా 95 వరకు జరిగినట్లు తేలింది. మైదుకూరు మండలంలో నిబంధనల మేరకు 263 జరగ్గా, వ్యతిరేకంగా 57 వరకు జరిగినట్లు తేలింది.

అంతర్జాతీయ స్థాయిలో గండికోట అభివృద్ధి

పర్యాటక దినోత్సవంలో వైఎస్ఆర్ కలెక్టర్ శివశంకర్, జమ్మలమడుగు ఎమ్మెల్యే ఆదినారాయణరెడ్డి

జమ్మలమడుగు, జమ్మలమడుగు గ్రామీణ, న్యూస్‌టుడే: అంతర్జాతీయస్థాయిలో గండికోట పర్యాటక కేంద్రానికి ప్రత్యేక స్థానాన్ని తీసుకొస్తామని వైఎస్ఆర్ జిల్లా కలెక్టర్ శివశంకర్ ఆశాభావం వ్యక్తం చేశారు. ప్రపంచ పర్యాటక దినోత్సవం సందర్భంగా గండికోట పర్యాటక కేంద్రంలో శుక్రవారం గండికోట అభివృద్ధి కమిటీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఎంట్రన్స్ గేట్, గుర్రపుస్వారీ, నూతన ఏటీఎం, వాహనాల పార్కింగ్, ఆర్వో వాటర్ ప్లాంట్, కేఫ్ స్టాల్‌ను జమ్మలమడుగు ఎమ్మెల్యే ఆదినారాయణరెడ్డి, తెదేపా జమ్మలమడుగు నియోజకవర్గ ఇన్‌ఛార్జి భూపేష్‌రెడ్డితో కలిసి ప్రారంభించారు. పెన్నాలోయ సమీపంలో ఏర్పాటు చేసిన సభావేదికపై కలెక్టర్ ప్రసంగించారు. ఇక్కడ ఒబెరాయ్ సంస్థ నిర్వాహకులు అయిదు నక్షత్రాల రిసార్ట్‌ను నిర్మించనున్నట్లు తెలిపారు. హార్స్ రైడింగ్, అడ్వెంచర్ అకాడమీ అబ్బురపరిచే విన్యాసాలతో పర్యాటకులను ఆకర్షిస్తున్నట్లు తెలిపారు. రానున్నరోజుల్లో ఈ ప్రాంతం రూపురేఖలు మారనున్నాయని చెప్పారు. పర్యాటకం అంటే ఆనందంతోపాటు ఆదాయాన్నిచ్చే వనరుగా ఉండాలన్న ఉద్దేశంతో దశలవారీగా అభివృద్ధి చేస్తామన్నారు. ఈ విషయంలో ఎమ్మెల్యే ఆదినారాయణరెడ్డి సహకారం అభినందనీయమని తెలిపారు.


గుర్రపు స్వారీ చేస్తున్న ఎమ్మెల్యే ఆదినారాయణరెడ్డి, కలెక్టర్ శివశంకర్, జేసీ అదితిసింగ్

రూ.80 కోట్లు మంజూరుకు కృషి

కులమతాలకతీతంగా గండికోటలో ప్రపంచ పర్యాటక దినోత్సవాన్ని జరుపుకోవడం సంతోషంగా ఉందని జమ్మలమడుగు ఎమ్మెల్యే ఆదినారాయణరెడ్డి అన్నారు. గండికోట పర్యాటక అభివృద్ధితోపాటు జమ్మలమడుగు నియోజకవర్గాన్ని అన్ని విధాలుగా ముందుకు తీసుకెళ్తున్నట్లు పేర్కొన్నారు. స్వదేశీ దర్శన్ కార్యక్రమంలో భాగంగా కేంద్రం నుంచి రూ.80 కోట్లు నిధులు మంజూరయ్యేలా కృషి చేస్తామన్నారు. జమ్మలమడుగులో వచ్చే నెల ఏడో తేదీన మెగా ఉద్యోగమేళా నిర్వహిస్తున్నామన్నారు. ఫ్యాక్షన్ వద్దు.. ఫ్యాషన్ ముద్దు అనే నినాదంతో ముందుకెళ్తున్నామన్నారు.


భరతమాత వేషధారణలో నృత్యకారిణి అభినయం

అలరించిన సాంస్కృతిక కార్యక్రమాలు

పెన్నాలోయ సమీపంలో నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. నృత్య తరంగిణి, సాయిపరమేశ్వర డిగ్రీ కళాశాల విద్యార్థినుల కోలాటం, విభిన్న ప్రతిభావంతుడైన కామిశెట్టి వెంకట్ నిర్వహించిన నృత్యం ఆకట్టుకున్నాయి. శ్రీనివాస్ జానపద నృత్యగీతం, డీపీవో కార్యాలయ ఏవో ఖాదర్‌బాషా కవితలు కడుపుబ్బా నవ్వించాయి. రచయిత తవ్వా ఓబులరెడ్డి అయిదో ఎడిషన్ 'గండికోట' పుస్తకాన్ని కలెక్టర్, ఎమ్మెల్యే ఆవిష్కరించారు. వేడుకల్లో జేసీ అదితిసింగ్, డీఎఫ్‌వో సందీప్‌రెడ్డి, ఆర్డీవో శ్రీనివాస్, జిల్లా పర్యాటకశాఖాధికారి సురేష్‌కుమార్, మేనేజరు రామ్‌కుమార్, సర్పంచి ఈశ్వర్ ఎంపీటీసీసభ్యురాలు పద్మావతమ్మ, తదితరులు పాల్గొన్నారు.


ప్రొద్దుటూరు నృత్య తరంగిణి కళాకారుల ప్రదర్శన

గండి లడ్డూ ప్రసాదం నాణ్యతపై పరిశీలన

నమూనాలు సేకరించిన అధికారులు

స్పందనకు వందనం

చక్రాయపేట, న్యూస్‌టుడే: ప్రముఖ గండి క్షేత్రంలోని శ్రీవీరాంజనేయస్వామి దేవస్థానంలో లడ్డూల నాణ్యతను శుక్రవారం పులివెందుల సహాయ ఆహార భద్రతాధికారిణి హరిత పరిశీలించారు. ఇక్కడ లడ్డూ ప్రసాదం నాణ్యతపై 'ఈనాడు'లో ఈ నెల 25వ తేదీన 'గండి లడ్డూలో నాణ్యతెంత?' శీర్షికన ప్రచురితమైన కథనంపై ఉన్నతాధికారులు స్పందించారు. వీరి ఆదేశాల మేరకు ఆలయాన్ని ఆమె సందర్శించారు. లడ్డూ ప్రసాదంలో నాణ్యత ప్రమాణాలను పరిశీలించేందుకు కొన్నింటిని పరీక్షల నిమిత్తం కడపకు తీసుకెళ్లినట్లు గండి ఆలయ సహాయ కమిషనర్ వెంకటసుబ్బయ్య వివరించారు. భక్తులకు అందిస్తున్న ప్రసాదాలు, అన్నదానానికి వాడే నిత్యావసర సరకుల నమూనాలను సేకరించారన్నారు. భక్తులు తాగే మంచినీటి నమూనాలను సైతం తీసుకెళ్లినట్లు ఆయన వెల్లడించారు.

డిక్లరేషన్ ఇవ్వాల్సిందే


కోర్టులో గంగమ్మ ఆలయం ప్రాంగణంలో నిరసన చేస్తున్న జనసేనపార్టీ నాయకులు

మదనపల్లె పట్టణం, న్యూస్‌టుడే: మాజీ సీఎం జగన్ తిరుమలకు కాలినడకన వెళ్లే ముందు డిక్లరేషన్ ఇవ్వాల్సిందేనని జనసేనపార్టీ రాయలసీమ రీజియన్ కోఆర్డినేటర్ దారం అనిత డిమాండు చేశారు. తిరుమల లడ్డూ అపవిత్రం చేసినందుకు ఉపముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్ చేపట్టిన ప్రాయశ్చిత్త దీక్షకు మద్దతుగా ఆ పార్టీ నాయకులు, కార్యకర్తలు కోర్టులో గంగమ్మ ఆలయం ఆవరణలో 4వ రోజు శుక్రవారం నిరసన చేశారు. అనిత మాట్లాడుతూ వైకాప అయిదేళ్ల పాలనలో మాజీ సీఎం జగన్ సతీసమేతంగా తిరుమల బ్రహ్మోత్సవాలకు వచ్చి పట్టువస్త్రాలు సమర్పించలేదన్నారు. పవిత్రమైన తిరుమల లడ్డూను అపవిత్రం చేసిన వారిపై ప్రభుత్వం కఠిన చర్యలు తీసుకోవాలని కోరారు. నాయకులు హరిప్రసాద్, అశ్వత్, ధరణి, అశోక్, కె.చంద్రశేఖర్ తెదేపా నాయకులు శ్రీరాములు, అనంత, రూప, ప్రశాంతి, తదితరులు పాల్గొన్నారు.

పేదల ఇళ్ల బిల్లులకు మోక్షం!

జిల్లాలో 20,522 మంది లబ్ధిదారుల గుర్తింపు
2014-19 వరకు బకాయిలు రూ.36.61 కోట్లు
నిధుల విడుదలకు ఎన్డీయే సర్కారు నిర్ణయం

– న్యూస్‌టుడే, రాజంపేట పట్టణం, గ్రామీణ, సుండుపల్లి

పేదల సొంతింటి కలను నిజం చేయాలని గత తెదేపా ప్రభుత్వం ముందుకొచ్చింది. గృహయోగం కల్పించాలని సంకల్పించింది. బడుగుజీవుల ఆశల సౌధం నిర్మాణానికి పచ్చజెండా ఊపింది. ఇక గూడు వెతలు తీరుతాయని ఆశించారు. చాలామంది లబ్ధిదారులు ఇంటి నిర్మాణ పనులకు శ్రీకారం చుట్టారు. అనంతరం వైకాపా అధికారంలోకి వచ్చింది. అప్రజాస్వామికంగా కక్షపూరిత పాలనకు తెరలేపింది. పేదలు నిర్మించుకునే ఇళ్లకు బిల్లుల చెల్లింపులను నిలిపేసింది. అయిదేళ్లపాటు కళ్లుకాయలు కాసేలా లబ్ధిదారులు ఎదురుచూసినా నిరాశే మిగిలింది. రాష్ట్రంలో ఎన్డీయే కూటమి అధికారంలోకి వచ్చిన అనంతరం జగన్ జమానాలో నిర్లక్ష్యానికి గురైన రంగాలకు జీవం పోసి జవసత్వాలు నింపాలని కీలక నిర్ణయం తీసుకోవడంతో లబ్ధిదారుల్లో ఆనందం వెల్లివిరుస్తోంది.

జిల్లాలో గత తెదేపా ప్రభుత్వ హయాంలో 2014-2019 వరకు గ్రామీణ పేదలకు మంజూరైన పక్కాగృహాల బిల్లులను వైకాపా ప్రభుత్వం చెల్లించకుండా నిలిపేసింది. ఐఏవై, పీఎంఏవై గ్రామీణ, రూరల్ హౌసింగ్, జీవో 171, స్పిల్‌ఓవర్‌లో ఇళ్లు మంజూరైన 20,522 మందికి రూ.36.61 కోట్ల మేర బిల్లుల బకాయిలు చెల్లించాల్సి ఉంది. వైకాపా అధికారంలోకి వచ్చిన అనంతరం అపరిష్కృతంగా ఉన్న బిల్లులు ఇవ్వకుండా పక్కన పెట్టేసింది. గృహనిర్మాణశాఖ కార్యాలయాల చుట్టూ పేదలు, బడుగుజీవులు పలుమార్లు తిరిగినా జగన్ ప్రభుత్వం కరుణించలేదు. చాలామంది విసిగిపోయారు. ఇక వచ్చే పరిస్థితి లేదని ఆశలు వదులుకున్నారు.


మదనగోపాలాపురంలో బిల్లులందక నిలిచిపోయిన గృహనిర్మాణం

ఇదీ పక్కాగృహాల ప్రగతి

◆ జిల్లాలో ఇంకా మొదలుకాని ఇళ్లు 3,770, గుంతల దశలో 50, పునాది దశలో 3,872, కిటికీల వరకు 9, గోడల వరకు 1,336, పైకప్పు వేసినవి 8,328, పూర్తయినవి 3,157 ఇళ్లు ఉన్నట్లు ఇటీవల అధికారులు గుర్తించారు. ఎన్డీయే ప్రభుత్వం చొరవ తీసుకుని 2014-19 మధ్య కాలంలో నిలిచిపోయిన బిల్లులు చెల్లించాలని కీలక నిర్ణయం తీసుకోవడంతో పేదలు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. క్షేత్రస్థాయిలో పరిశీలించి లబ్ధిదారుల అభిప్రాయాలను సేకరించాలని రాష్ట్ర ఉన్నతాధికారులు ఆదేశించారు. ప్రస్తుతం ఏ దశలో ఉన్నాయో యాప్‌లో నమోదు చేయాలని ఉత్తర్వులిచ్చారు. ఇప్పటికే 9,165 మంది ఇళ్లను తనిఖీ చేశారు. వీరిలో చాలామందికి అర్హత ఉందని సిబ్బంది తేల్చారు. గుంతలు, పునాది దశలో ఉన్న గృహాలను పీఎంఏవై-2లో అనుమతిచ్చి పూర్తి చేయించాలని నిర్ణయించారు.

◆ జిల్లాలోని 30 మండలాల్లో బిల్లులు రాని లబ్ధిదారులు ఉన్నారు. పీలేరులో అత్యధికంగా 1,779 మంది ఉన్నట్లు గృహనిర్మాణ శాఖ అధికారుల సర్వేలో గుర్తించారు. కేవీపల్లిలో 988, మదనపల్లెలో 969, రైల్వే కోడూరులో 961, పెనగలూరులో 780, వాల్మీకిపురంలో 762, కలికిరిలో 756, రాజంపేటలో 742, గాలివీడులో 737, గుర్రంకొండలో 735, పెద్దతిప్పసముద్రంలో 690, బి.కొత్తకోటలో 666, చిట్వేలిలో 648, వీరబల్లి లో 631, నందలూరులో 608, సుండుపల్లిలో 571, పుల్లంపేట మండలంలో 566 మందికి బిల్లులు రావాల్సి ఉంది. ఇక్కడే కాకుండా మిగతా మండలాల్లోనూ పేదలు, బడుగులు ఆశగా ఎదురుచూస్తున్నారు. త్వరలో అనుమతి ఇవ్వనున్నారు. బిల్లుల భాగ్యం దక్కితే ఇంకా మొదలు పెట్టని, అసంపూర్తిగా ఉన్న గృహాల పనులను చేపట్టి సొంతింటి కలను సాకారం చేసుకోవాలని లబ్ధిదారులు భావిస్తున్నారు.

క్షేత్రస్థాయిలో సర్వే చేస్తున్నాం

రాష్ట్ర ప్రభుత్వం ఆదేశాల మేరకు 2014-19 వరకు పక్కాగృహాలు మంజూరై బిల్లులు రాని లబ్ధిదారులున్నట్లు గుర్తించాం. క్షేత్రస్థాయిలో సర్వే చేస్తున్నాం. మంజూరైన ఇల్లు ఏ దశలో ఉందని సమాచారం సేకరిస్తున్నాం. ఉన్నత స్థాయి నుంచి అనుమతి రాగానే అందరికీ బిల్లులు చెల్లించడానికి చర్యలు తీసుకుంటాం.

- మురళి, బాధ్య ఈఈ, గృహనిర్మాణశాఖ, రాజంపేట

ఎమ్మెల్యే చొరవతో స్వదేశానికి రాక


ఎమ్మెల్యే నల్లారి కిశోర్‌కుమార్‌రెడ్డితో బాధితుడు మునిస్వామి, కుటుంబసభ్యులు

పీలేరు గ్రామీణ, న్యూస్‌టుడే: బతుకుదెరువు కోసం విదేశాలకు వెళ్లి అక్కడ తీవ్ర ఇబ్బందులు పడుతున్న ఓ వ్యక్తి పీలేరు ఎమ్మెల్యే నల్లారి కిశోర్‌కుమార్‌రెడ్డి చొరవతో స్వగ్రామం చేరుకున్నారు. పీలేరు మండలం కాకులారంపల్లె పంచాయతీ ఇందిరమ్మ కాలనీకి చెందిన మునిస్వామి రూ.3 లక్షలు ఖర్చు పెట్టుకుని రాయచోటికి చెందిన ఏజెంటు ద్వారా ఈ నెల 10న మలేసియాకు వెళ్లారు. నర్సరీలో పని అని చెప్పిన ఏజెంట్ నెలకు రూ.50 వేలు వేతనం ఉంటుందని నమ్మబలికాడు. అక్కడ కారు షెడ్‌లో పనికి పంపారు. రెండ్రోజుల అనంతరం ఇంట్లో బంధించి అన్నం కూడా పెట్టకుండా చిత్రహింసలకు గురి చేశారు. ఇదే విషయాన్ని మునిస్వామి కుటుంబ సభ్యులు స్థానిక తెదేపా నాయకులు ద్వారా పీలేరు ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లారు. ఆయన ఎస్పీ విద్యాసాగర్‌నాయుడికి చెప్పడంతో స్పందించిన ఆయన వెంటనే ఏజెంటు వివరాలను సేకరించి మునిస్వామిని శుక్రవారం స్వగ్రామానికి తీసుకొచ్చారు. మునిస్వామి ఇంటికి చేరుకోవడంతో ఆయన కుటుంబ సభ్యులు ఎమ్మెల్యేని కలిసి కృతజ్ఞతలు తెలిపారు.

తరగతుల విలీనం... పాఠశాలలు కళావిహీనం!

ప్రాథమిక పాఠశాలలపై జీవో 117 ప్రభావం


రామాపురం మండలం గోపగుడపల్లిలోని ప్రాథమిక పాఠశాల విద్యార్థులను జడ్పీ ఉన్నత పాఠశాలలోకి విలీనం చేయడంతో విద్యార్థుల్లేక ఇలా మూతబడింది

– న్యూస్‌టుడే, రైల్వేకోడూరు, పుల్లంపేట

గత వైకాపా ప్రభుత్వం తీసుకొచ్చిన జీవో 117తో ప్రాథమిక పాఠశాలలు కళ తప్పాయి. విద్యార్థులతో కళకళలాడిన బడులు జీవో అమలుతో విద్యార్థుల్లేక మూతపడ్డాయి. కొన్ని పాఠశాలల్లో అసలు ప్రవేశాలే లేకపోవడం గమనార్హం. గత వైకాపా సర్కారు నిర్వాకంతో విద్యార్థులను బడులకు దూరం చేసే పరిస్థితి నెలకొంది. ఇంటి పక్కన, వీధి చివర ఉన్న పాఠశాలల్లో హాయిగా చదువుకునే విద్యార్థులను విలీనం పేరిట దూరంగా ఉన్న పాఠశాలలకు పంపడంతో అనేకమంది ప్రైవేటు పాఠశాలల వైపు వెళ్లిపోయే పరిస్థితులు నెలకొన్నాయి. ప్రధానంగా ఆడపిల్లల చదువుపై తీవ్ర ప్రభావం చూపిందని ఉపాధ్యాయులు చెబుతున్నారు.

◆ జిల్లా పరిధిలోని ప్రాథమిక పాఠశాలలపై జీవో 117 తీవ్ర ప్రభావం చూపింది. అనేక పాఠశాలలు విలీన ప్రక్రియతో బోసిపోయాయి. గాలివీడు, కలికిరి, లక్కిరెడ్డిపల్లె, ములకలచెరువు, రామాపురం మండలాల్లోని 13 ప్రాథమిక పాఠశాలల్లో ఈ ఏడాది ప్రవేశాలు లేకుండాపోయాయి. కొన్ని పాఠశాలలు ఇద్దరు, ముగ్గురు విద్యార్థులతో భారంగా నడుస్తున్నాయి. పుల్లంపేట మండలంలో 72 పాఠశాలలున్నాయి. వీటిలో 60 ప్రాథమిక పాఠశాలలుండగా, మొత్తం 4,336 మంది విద్యార్థులు చదువుకుంటున్నారు. కొత్తపేట, అనంతంపల్లె, టి.కమ్మపల్లె ప్రాథమిక పాఠశాలల్లోని 3,4,5 తరగతుల విద్యార్థులను జిల్లా పరిషత్తు ఉన్నత పాఠశాలల్లో విలీనం చేయడంతో ప్రస్తుతానికి ఏక సంఖ్యలో విద్యార్థులు మిగిలారు. రైల్వేకోడూరు మండలంలో 76 ప్రాథమిక, 4 ప్రాథమికోన్నత, 9 ఉన్నత పాఠశాలలున్నాయి. ఇక్కడ విలీన సమస్య వేధిస్తోంది. జీవో అమలుతో పదిమంది లోపున్న పాఠశాలలు 11 వరకు ఉన్నాయి. ఈ మార్పులకు అనుగుణంగా ఉపాధ్యాయుల సంఖ్య కూడా బాగా తగ్గిపోయింది. ఏకోపాధ్యాయ పాఠశాలలు పెరిగాయి. విద్యార్థులను దూర ప్రాంతాల్లోని పాఠశాలల్లో విలీనం చేయడంతో కొందరు ప్రైవేటు పాఠశాలల్లో ప్రవేశాలు పొందారు. ప్రభుత్వ విద్యను బలోపేతం చేస్తామంటూ గత వైకాపా సర్కారు ఉన్న విద్యార్థులను కూడా పక్కదారి పట్టించడం గమనార్హం.


పుల్లంపేట మండలం టి. కమ్మపల్లె ప్రాథమిక పాఠశాలలో విలీనానికి ముందు 30 మంది విద్యార్థులుండగా, విలీనంతో అయిదుగురే మిగిలారు

ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లాం

పాఠశాలల విలీనంతో కలిగే ఇబ్బందులు, సమస్యలపై ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లాం. ప్రభుత్వ పాఠశాలలు మానేస్తున్న విద్యార్థుల తల్లిదండ్రులతో మాట్లాడి తిరిగి పిల్లలను చేర్పించేవిధంగా చర్యలు తీసుకుంటున్నాం. తక్కువ మంది విద్యార్థులున్న పాఠశాలల్లో కూడా ఉపాధ్యాయులను సర్దుబాటు చేశాం. జీవో 117పై ప్రభుత్వం త్వరలో ఒక ప్రకటన చేసే అవకాశం ఉంది. **- శివప్రకాష్‌రెడ్డి, డీఈవో**

పీలేరు 11వ అదనపు జిల్లా న్యాయమూర్తిగా మహేష్



పీలేరు, న్యూస్‌టుడే: పీలేరు న్యాయస్థానం 11వ అదనపు జిల్లా న్యాయమూర్తిగా ఏ.మహేష్ శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. ఇప్పటి వరకు ఇన్‌ఛార్జిగా ఉన్న తొమ్మిదో అదనపు జిల్లా న్యాయమూర్తి డాక్టర్ ఎస్.శ్రీనివాసరావు దగ్గర నుంచి ఏ.మహేష్ బాధ్యతలు చేపట్టారు.

గణతంత్ర వేడుకలకు పీలేరు డిగ్రీ విద్యార్థి



రూపేష్

పీలేరు గ్రామీణ, న్యూస్‌టుడే: దిల్లీలో వచ్చే ఏడాది జనవరిలో జరిగే గణతంత్ర దినోత్సవాలకు పీలేరు సంజయ్‌గాంధీ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో బీఎస్సీ తృతీయ సంవత్సరం చదువుతున్న ఎన్‌ఎస్‌ఎస్ విద్యార్థి రూపేష్ ఎంపికైనట్లు కళాశాల ప్రిన్సిపల్ సుధాకర్‌రెడ్డి శుక్రవారం తెలిపారు. శ్రీవేంకటేశ్వర విశ్వవిద్యాలయ పరిధిలో తమ కళాశాల నుంచి ఈ విద్యార్థి ఎంపిక వడం గర్వకారణమన్నారు. ఈ విద్యార్థి మహారాష్ట్రలోని జల్గాం జిల్లాలో జరిగే శిక్షణ కార్యక్రమంలో పాల్గొననున్నారని తెలిపారు. కళాశాల అధ్యాపక బృందం తదితరులు ఈ విద్యార్థిని అభినందించారు.

వైద్యకళాశాల భవననిర్మాణ పనులు పునఃప్రారంభించాలి

మదనపల్లె గ్రామీణ, న్యూస్‌టుడే: నిర్మాణ పనులను నిలిపేసిన మదనపల్లె ప్రభుత్వ వైద్యకళాశాల భవనాన్ని తిరిగి ప్రారంభించాలని రాయలసీమ విద్యార్థి సమాఖ్య రాష్ట్ర అధ్యక్షుడు జగన్ డిమాండు చేశారు. సబ్‌కలెక్టర్ కార్యాలయం ఎదుట ఆ విద్యార్థి సంఘం ఆధ్వర్యంలో శుక్రవారం నిరసన చేశారు. ఆయన మాట్లాడుతూ మదనపల్లె ప్రభుత్వ వైద్యకళాశాల నడపలేమని రాష్ట్ర ప్రభుత్వం ఎన్‌ఎంసీకి రాసిన లేఖను ఉపసంహరించుకోవాలని, రాయలసీమవాసిగా కేంద్ర ఆరోగ్యశాఖ మంత్రి సత్యకుమార్ ఈ ప్రభుత్వ కళాశాలల్లో స్పందించి వైద్యవిద్యార్థులకు న్యాయం చేయాలని, దీనిపై రాయలసీమలోని ఎమ్మెల్యేలు ఎందుకు మాట్లాడటం లేదని ప్రశ్నించారు. వైద్య విద్యార్థులకు న్యాయం చేయాలని, లేకపోతే ఉద్యమాలు తప్పవని హెచ్చరించారు. సబ్‌కలెక్టర్ కార్యాలయంలోని డీఏవో పద్మావతమ్మకు అర్జీ సమర్పించారు. నాయకులు మదన్‌నాయక్, వంశీ, సురేష్, వినయ్ పాల్గొన్నారు.



సబ్‌కలెక్టర్ కార్యాలయం ఎదుట నిరసన చేస్తున్న ఆర్ఎస్‌వో నాయకులు

ఉత్తరాఖండ్‌లో చిక్కుకున్న బి.కొత్తకోట యాత్రికులు

బి.కొత్తకోట, న్యూస్‌టుడే: ఉత్తరాఖండ్‌లో కురుస్తున్న భారీవర్షాలకు రహదారి దెబ్బతిని వాహనాల రాకపోకలు స్తంభించడంతో బి.కొత్తకోటకు చెందిన 11మంది యాత్రికులు ఇబ్బందులకు గురయ్యారు. దాదాపు 24గంటల పాటు మార్గమధ్యలో బస్సులోనే పరిమితమైన యాత్రికులు శుక్రవారం రాత్రి సురక్షితంగా దిల్లీకి చేరుకోవడంతో స్థానికంగా ఉన్న వారి కుటుంబ సభ్యులు ఊపిరిపీల్చుకున్నారు. బాధితుల కథనం మేరకు పట్టణానికి చెందిన పద్మావతి, రాజా, హరిణి, వెంకట్రమణలతో పాటు మరో ఏడుగురు ఉత్తరాఖండ్ యాత్రకు బయలుదేరారు. ఈ నెల 26న బద్రీనాథ్‌లో దైవదర్శనం చేసుకుని ఉదయం తొమ్మిది గంటలకు హరిద్వార్‌కు బస్సులో బయలుదేరారు. భారీ వర్షం కురుస్తుండటంతో మధ్యలో రోడ్డు కోసుకుపోయి వాహనాల రాకపోకలు ఆగిపోయాయి. దీంతో యాత్రికులు రాత్రి 8గంటల వరకు బస్సులోనే ఉండిపోయారు. స్థానిక ప్రభుత్వ అధికారుల చొరవతో ట్రాఫిక్‌ను మరో మార్గం గుండా మళ్లించగా.. కొంతదూరం ప్రయాణం తర్వాత అక్కడ రోడ్డు కోసుకుపోవడంతో మళ్లీ బస్సు నిలిచింది. రాత్రి వేళలో బస్సు ఆగడంతో ప్రయాణికులు భయాందోళనలకు గురయ్యారు. శుక్రవారం ఉదయం తొమ్మిది గంటలకు రోడ్డు మరమ్మతులు చేసి రాకపోకలను అధికారులు పునరుద్ధరించారు. యాత్రికులు దిల్లీకి సురక్షితంగా చేరుకున్నారు. శుక్రవారం రాత్రి అక్కడి నుంచి బి.కొత్తకోటకు ఆదివారం చేరుకుంటారని బాధితుల బంధువు కనకంటి ప్రసాద్ తెలిపారు.

రూ. కోట్ల ప్రజాధనం... నిరుపయోగం

- జగనన్న కాలనీల్లో విద్యుత్తు పనుల ఖర్చు రూ.77.68 కోట్లు
- శివారు ప్రాంతాల్లో అభద్రత నడుమ సామగ్రి

-న్యూస్‌టుడే, ప్రొద్దుటూరు గ్రామీణ

పేదలందరికీ ఇళ్ల పథకంలో భాగంగా గత వైకాపా ప్రభుత్వం జగనన్న కాలనీల్లో కరెంటు సరఫరా పనులకు వ్యయం చేసిన రూ.77.68 కోట్ల నిధులు వృథాగా మారాయి. ఈ దుస్థితి ఉమ్మడి కడప జిల్లాల పరిధిలోని నగర కార్పొరేషన్, మున్సిపాల్టీలు, గ్రామీణ ప్రాంతాల్లో నెలకొంది. పాలకులు, ఉన్నతాధికారుల నుంచి ఎస్పీడీసీఎల్‌కు వచ్చిన ఒత్తిళ్ల దృష్ట్యా అప్పట్లో కన్‌స్ట్రక్షన్ ఇంజినీరింగ్ అధికారులు హడావుడిగా ఏర్పాటుచేసిన స్తంభాలు, తీగలు, నియంత్రికలు అలంకారప్రాయంగా మారాయి. కాలనీలు నివాసయోగ్యంగా లేవు.

మౌలిక సౌకర్యాల లేని కారణంగా లబ్ధిదారు సొంతింట్లో చేరేందుకు విముఖత చూపుతున్నారు. శివారు ప్రాంతాల్లో ఉన్న విద్యుత్తు సామగ్రిలో స్తంభాలు మినహా తీగలు, నియంత్రికలు చివరకు చోరీ అయ్యే పరిస్థితులు కనిపిస్తున్నాయి. ఎస్పీడీసీఎల్ పరిధిలోని రాయచోటి, రాజంపేట, పులివెందుల, కడప, ప్రొద్దుటూరు, మైదుకూరు, డివిజన్ల వారీగా మొత్తం 689 చోట్ల లేవుట్లు ఉండగా రూ.77.68 కోట్ల వ్యయంతో మొత్తం 1,16,699 ప్లాట్లకు కరెంటు సరఫరా అందజేయాలనే లక్ష్యాన్ని నిర్దేశించారు. కానీ గత నాలుగేళ్ల వ్యవధిలో 575 చోట్ల మాత్రమే విద్యుత్తు సౌకర్యాన్ని అందుబాటులోకి తెచ్చారు. ఆరు డివిజన్లలోని 114 లేఅవుట్లలోని 3,785 ప్లాట్లకు కరెంటు సరఫరా కల్పనలో జాప్యం జరుగుతోంది. కరెంటు సౌకర్యమున్న కాలనీల్లో ఇళ్ల నిర్మాణాలు పూర్తికాకపోవడంతో మొండి గోడలు దర్శనమిస్తున్నాయి. రూ.కోట్ల వ్యయంతో ఏర్పాటు చేసిన నియంత్రికలు, స్తంభాలు, తీగలు..దిష్టిబొమ్మలను తలపిస్తున్నాయి. నల్లరేగడి భూముల్లో ఏర్పాటు చేసిన స్తంభాలు ఒరిగిపోతున్నాయి.



బొల్లవరం జగనన్న కాలనీలో దిమ్మెలపై అలంకారప్రాయంగా నియంత్రికలు

డివిజన్లవారీగా ప్రొద్దుటూరులో 2,217 ఇళ్లకు కరెంటు మీటర్లిచ్చారు. కడపలో 3,114, పులివెందులలో 1,537, రాజంపేటలో 1,429, రాయచోటిలో 1,412 వాటికి ఇచ్చారు.

డివిజను	మొత్తం లే-అవుట్లు	మొత్తం ప్లాట్లు	జగనన్న కాలనీలకు వెలుగులు	లబ్ధిదారుల ప్లాట్లకు కరెంటు సరఫరా
రాజంపేట	164	13,619	132	12,576
రాయచోటి	117	12,294	94	11,799
కడప	41	27,078	36	26,873
పులివెందుల	97	14,274	77	13,318
ప్రొద్దుటూరు	136	33,768	116	33,161
మైదుకూరు	134	15,666	120	15,187

ఉన్నతాధికారుల ఆదేశాలు పాటించాం

ఆరు డివిజన్లవారీగా జగనన్న కాలనీల్లో ఇంటి నిర్మాణాలు జరగుతున్న చోట్ల మాత్రమే వెలుగులను అందజేసేందుకు సౌకర్యాలను కల్పించాం. కట్టడాలు లేని చోట్ల కరెంటు ఏర్పాటు పనులను చేపట్టలేదు. లబ్ధిదారుల ప్రయోజనాల దృష్ట్యా అప్పట్లో ఉన్నతాధికారుల ఆదేశాలతో విద్యుత్తు సరఫరా కోసం చర్యలు తీసుకున్నాం. -రమణ, ఎస్ఈ, ఎస్పీడీఈసీఎల్

పోలీసుశాఖ స్థలం ఆక్రమణపై ఎస్పీ ఆరా

కలకడ, న్యూస్‌టుడే: కలకడలో ఆక్రమణకు గురైన పోలీసుశాఖ స్థలాన్ని శుక్రవారం ఎస్పీ విద్యాసాగర్ నాయుడు పరిశీలించారు. స్థానిక పోలీసుస్టేషన్ సమీపంలో కొంత స్థలం ఆక్రమణకు గురైందని పోలీసులు ఎస్పీ దృష్టికి తీసుకెళ్లడంతో ఆయన పరిశీలించారు. దస్త్రాలు తనిఖీ చేసి, స్థలాన్ని సర్వే చేసి ఆక్రమణకు గురికాకుండా కంచె ఏర్పాటు చేయాలని రెవెన్యూ, పోలీసుశాఖల అధికారులకు సూచించారు. సర్వే చేసి పోలీసుశాఖ స్థలానికి హద్దులు ఏర్పాటు చేస్తామని రెవెన్యూ శాఖాధికారులు తెలిపారు. ఆయనవెంట డీఎస్పీ కృష్ణమోహన్, సీఐ గురునాథ, ఎస్.ఐ.రామాంజనేయులు, తహసీల్దారు ఫణికుమార్, సర్వేయర్ దేవి, తదితరులున్నారు.



రెవెన్యూశాఖాధికారులతో మాట్లాడుతున్న ఎస్పీ విద్యాసాగర్‌నాయుడు

సరకుల నిల్వల వివరాలు నమోదు చేయండి

కలికిరి గ్రామీణ, న్యూస్‌టుడే: కలికిరి వ్యవసాయ మార్కెట్ యార్డులోని పౌరసరఫరాల శాఖ గోదాంను శుక్రవారం మదనపల్లె సబ్‌కలెక్టర్ మేఘస్వరూప్ తనిఖీ చేశారు. గోదాంలోని దస్త్రాలతోపాటు అంగన్‌వాడీ కేంద్రాలకు సరఫరా చేసే వంటనూనె ప్యాకెట్ల కాలపరిమితిని పరిశీలించారు. గోదాంలోని సరకుల నిల్వలకు సంబంధించిన వివరాలను ఎప్పటికప్పుడు నమోదు చేయాలని ఇన్‌ఛార్జి డీటీ అనితను ఆదేశించారు. అనంతరం తహసీల్దారు కార్యాలయంలో ఫ్రీహోల్డ్ భూములకు సంబంధించిన దస్త్రాలను తనిఖీ చేశారు. ఆయనవెంట తహసీల్దారు మహేశ్వరిబాయి, తదితరులున్నారు.



గోదాంలో వంటనూనె ప్యాకెట్ల కాలపరిమితిని పరిశీలిస్తున్న మదనపల్లె సబ్‌కలెక్టరు మేఘస్వరూప్

పట్టపగలే మదనపల్లెలో చోరీ

రూ.4 లక్షల విలువైన నగదు, నగలు అపహరణ

మదనపల్లె నేరవార్తలు, న్యూస్‌టుడే: పట్టపగలు ఇంట్లో నడవలేని వృద్ధుడు ఉండగానే గుర్తుతెలియని వ్యక్తులు ఇంట్లోకి చొరబడి రూ.4 లక్షల విలువ చేసే బంగారు ఆభరణాలు, నగదు అపహరించుకుని వెళ్లిన సంఘటన మదనపల్లె పట్టణంలో శుక్రవారం జరిగింది. నీరుగట్టువారిపల్లెలోని రామిరెడ్డిలేఅవుట్‌కు చెందిన జగన్నాథ్, అతని భార్య రాధ కోళ్లబైలు రోడ్డులో చిల్లర దుకాణం నిర్వహిస్తారు. వీరితో పాటు తండ్రి చిన్నరెడ్డెయ్య ఉంటారు. నడవలేని స్థితిలో ఉండటంతో తండ్రిని ఇంట్లో ఉంచి బయట తాళం వేసుకుని వెళ్తారు. ఈ నేపథ్యంలో శుక్రవారం మధ్యాహ్నం జగన్నాథ్ తండ్రికి భోజనం పెట్టేందుకు వచ్చారు. అప్పటికే గుర్తుతెలియని వ్యక్తులు ఇంటి అద్దాలు, తలుపులు పగలగొట్టి బీరువాలోని వస్తువులన్ని కింద పడేసి ఉండటంతో చోరీ జరిగినట్లు గుర్తించారు. ఒకటో పట్టణ పోలీసులకు ఫిర్యాదు చేశారు. సీఐ చాంద్‌బాషా సంఘటనా స్థలానికి చేరుకుని వివరాలు, నిపుణులతో వేలిముద్రలు సేకరించారు.



ఇంట్లోని వస్తువులను చెల్లా చెదురుగా పడేసిన దుండగులు

ఉన్నత స్థానాలకు చేరుకోవాలి

కంభంవారిపల్లి, న్యూస్‌టుడే: గురుకుల పాఠశాల విద్యార్థులు భవిష్యత్తులో ఉన్నత స్థానాలకు ఎదగాలని జిల్లా విద్యాశాఖాధికారి శివప్రకాష్‌రెడ్డి సూచించారు. మండలంలోని గ్యారంపల్లె గురుకుల పాఠశాలను శుక్రవారం ఆయన తనిఖీ చేశారు. విద్యార్థుల వసతులు, భోజనాన్ని పరిశీలించారు. నాణ్యమైన భోజనాన్ని అందించాలని సూచించారు. పదో తరగతి విద్యార్థులు వంద శాతం ఉత్తీర్ణత సాధించాలన్నారు. ప్రత్యేక తరగతులు నిర్వహించి, పిల్లలకు మెరుగైన విద్యనందించాలని సూచించారు. శిథిలావస్థకు చేరుకున్న భవనం పైకప్పును పరిశీలించి, మరమ్మతులకు చర్యలు తీసుకుంటామని చెప్పారు. ఎంఈవో రెడ్డిబాషా, పాఠశాల ప్రిన్సిపల్ బ్రహ్మాజీ, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికి ఉద్యమ బాట



డీఈవో శివప్రకాష్‌రెడ్డికి నోటీసు అందిస్తున్న యూటీఎఫ్ నాయకులు

రాయచోటి గ్రామీణ, న్యూస్‌టుడే: సుదీర్ఘ కాలంగా అపరిష్కృతంగా ఉన్న మున్సిపల్ ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారానికి యూటీఎఫ్ ఆధ్వర్యంలో ఉద్యమిస్తామని ఆశాఖ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు హరిప్రసాద్, జబీర్ పేర్కొన్నారు. రాయచోటిలో డీఈవో శివప్రకాష్‌రెడ్డిని శుక్రవారం యూటీఎఫ్ నాయకులు కలిసి ఉద్యమ కార్యాచరణ నోటీసు అందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... మున్సిపల్ ఉన్నత పాఠశాలల్లో ఇప్పటికీ సరిపడా ఉపాధ్యాయులు లేరని.. దాంతో విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారంటూ ఆవేదన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో యూటీఎఫ్ నాయకులు చంద్రశేఖర్, వెంకటరమణ, రాధాకృష్ణ, చంద్రశేఖర్ పాల్గొన్నారు.

సైబర్ నేరాలపై అప్రమత్తత తప్పనిసరి

అంగళ్లు (కురబలకోట), న్యూస్‌టుడే: సమాజంలో సైబర్ నేరాలు విపరీతంగా పెరిగి పోతున్నాయని, విద్యార్థులు అప్రమత్తంగా ఉండాలని సప్తగిరి బ్యాంకు మేనేజర్ శ్రీలక్ష్మి సూచించారు. గోల్డెన్‌వ్యాలీ కళాశాలలో విద్యార్థులు పొదుపు విధానం, సైబర్ నేరాలపై శుక్రవారం అవగాహన సదస్సు నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ ప్రతి విద్యార్థి పొదుపును అలవాటు చేసుకోవాలన్నారు. సైబర్ నేరగాళ్లు ఆయా బ్యాంకుల్లోని ఖాతాదారుల నుంచి నిధులను దొంగలించడానికి బ్యాంకు అధికారులంటూ ఫోన్ చేస్తారని జాగ్రత్తగా వ్యవహరించాలని తెలిపారు. ఏవైన సమస్యలుంటే సమీపంలోని బ్యాంకుకు, లేదా 1930 నంబరుకు ఫిర్యాదు చేయాలని సూచించారు. బ్యాంకు ప్రతినిధులు పూర్ణిమ, శ్రీకాంత్, కళాశాల బాధ్య ప్రిన్సిపల్ డాక్టర్ బి.మధుసూదన్‌రావు, బీఈఎస్ డైరెక్టర్ బి.పి.ఎస్ రావు తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న సప్తగిరి బ్యాంకు మేనేజరు శ్రీలక్ష్మి, గోల్డెన్‌వ్యాలీ అధ్యాపకులు, బ్యాంకు ప్రతినిధులు శ్రీకాంత్, పూర్ణిమ తదితరులు

ఏఎంసీ కార్యదర్శి ఆర్జేడీ కార్యాలయానికి సరెండర్

పీలేరు, న్యూస్‌టుడే: పీలేరు వ్యవసాయ మార్కెట్ కమిటీ కార్యదర్శి సురేంద్రను కడప రీజినల్ మార్కెటింగ్‌శాఖ డైరెక్టర్ కార్యాలయానికి సరెండర్ చేస్తూ రెండ్రోజుల కిందట ఉత్తర్వులు వచ్చాయి. వాల్మీకిపురం మార్కెట్ కమిటీ కార్యదర్శి కుమార్‌ను పీలేరు కమిటీ ఇన్‌ఛార్జిగా కార్యదర్శిగా అదనపు బాధ్యతలు అప్పగిస్తూ ఆర్జేడీ ఉత్తర్వులు ఇచ్చారు. కుమార్ శుక్రవారం బాధ్యతలు చేపట్టారు. ఈ ఏడాది మార్చిలో పీలేరు కమిటీ ప్రాంగణంలో జరిగిన గొర్రెల సంతలో సెస్సుల వసూళ్ల బాధ్యతలు కార్యదర్శి సురేంద్ర, సూపర్‌వైజర్ వినయ్‌కుమార్ చూశారు. వసూళ్లు చేస్తుండగా మార్కెటింగ్‌శాఖ విజిలెన్స్ బృందం వసూళ్లను తనిఖీ చేసింది. తనిఖీలో వేసిన బిల్లుల కన్నా రూ.19 వేలు అదనంగా నగదు ఉన్నట్లు గుర్తించారు. ఆమేరకు నివేదిక తయారు చేసి విజిలెన్స్ బృందం కడప ఆర్జేడీకి పంపారు. దానిపై ప్రాథమికంగా పీలేరు కార్యదర్శి సురేంద్రను ఆర్జేడీ కార్యాలయానికి సరండర్ చేశారు. అలానే సూపర్‌వైజర్ వినయ్‌కుమార్‌కు ఒక ఇంక్రిమెంట్ కట్ చేశారు. సురేంద్రపై పూర్తిస్థాయి విచారణ తరువాత చర్యలు ఉంటాయని అధికారులు తెలిపారు. దీనిపై శుక్రవారం రాయచోటి అసిస్టెంట్ మార్కెటింగ్ డైరెక్టర్ త్యాగరాజును పీలేరు న్యూస్‌టుడే వివరణ కోరగా విజిలెన్స్ తనిఖీ జరిగిందని ప్రస్తుతం ఆర్జేడీ స్థాయి విచారణ జరుగుతోందని సురేంద్రను ఆర్జేడీ కార్యాలయానికి సరెండర్ చేశారని తెలిపారు.

డెంగీ, మలేరియా నివారణకు చర్యలు

రాయచోటి గ్రామీణ, న్యూస్‌టుడే: జిల్లాలో డెంగీ, మలేరియా వ్యాధుల నివారణకు పటిష్ట చర్యలు చేపట్టినట్లు డీఎంహెచ్‌వో ఎన్.కొండయ్య తెలిపారు. రాయచోటి మండలం వరిగ ,కాటిమాయకుంట గ్రామాల్లో శుక్రవారం నిర్వహించిన ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమాన్ని ఆయన తనిఖీ చేశారు. ఈ సందర్భంగా వైద్య సిబ్బందికి పలు సూచనలు చేశారు. గ్రామాల్లో ప్రతి ఒక్కరికీ నాణ్యమైన వైద్యసేవలందించాలని సిబ్బందిని ఆదేశించారు. స్థానికులకు వ్యాధుల నివారణపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో జిల్లా మలేరియా అధికారి వేణుగోపాల్, వైద్యులు, వైద్యసిబ్బంది పాల్గొన్నారు.



వైద్యసిబ్బందికి సూచనలిస్తున్న డీఎంహెచ్‌వో కొండయ్య





టపాసుల లారీ పట్టివేత

చిన్నమండెం, న్యూస్‌టుడే: తమిళనాడు రాష్ట్రం శివకాశి నుంచి టపాసుల లోడుతో ప్రొద్దుటూరు వెళ్తున్న లారీని తహసీల్దారు నరసింహులు చిన్నమండెంలో పట్టుకున్నారు. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు చిన్నమండెం మీదుగా వెళుతున్న వాహనాన్ని అధికారులు గుర్తించి సోదాలు చేశారు. సక్రమంగా రికార్డులు లేకపోవడం, నిబంధనలు పాటించకపోవడం వంటి కారణాలతో లారీని జప్తు చేశారు. అందులో రూ.3.20 లక్షల విలువైన టపాసులున్నట్లు ఆయన వివరించారు. పోలీసులకు వాహనాన్ని అప్పజెప్పినట్లు తహసీల్దారు వివరించారు.

విద్యార్థులకు నాణ్యమైన ఆహారం అందించండి

వేంపల్లె, న్యూస్‌టుడే : ట్రిపుల్‌ఐటీ విద్యార్థులకు నాణ్యమైన ఆహారం అందించకపోతే చర్యలు తప్పవని కడప ఫుడ్‌సేఫ్టీ అధికారిణి హరిత పేర్కొన్నారు. ఈ మేరకు శుక్రవారం ఆమె ఇడుపులపాయ ట్రిపుల్‌ఐటీని తనిఖీ చేశారు. ఎనిమిది మెస్‌లను తనిఖీచేశారు. విద్యార్థులకు ఏ రకమైన బియ్యం వాడుతున్నారని వంటశాలలకు వెళ్లి భోజనాన్ని పరిశీలించారు. కార్యక్రమంలో డైరెక్టర్ ఆచార్య కుమారస్వామిగుప్త, ఏవో పెనుగొండ రవికుమార్, విద్యార్థుల సంక్షేమాధికారి వెంకటేశు, మెస్ కో-ఆర్డినేటర్ రాము, ట్రిపుల్‌ఐటీ భద్రతాధికారి శరవణ్‌కుమార్, తదితరులు పాల్గొన్నారు.




భోజన నాణ్యతను పరిశీలిస్తున్న అధికారులు

రాష్ట్ర స్థాయి క్రీడాకారులకు అభినందన

పుల్లంపేట, , న్యూస్‌టుడే: రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికైన ఆదర్శ పాఠశాల విద్యార్థులను పుల్లంపేట ఎంఈవోలు చక్రధర్ రాజు, నాగతిరుమలరావులు అభినందించారు. పాఠశాలలో ఏర్పాటు చేసిన సభలో వారు మాట్లాడుతూ జిల్లా స్థాయి ప్రతిభను కొనసాగిస్తూ రాష్ట్ర స్థాయిలో జిల్లా ఖ్యాతిని నిలపాలన్నారు. పాఠశాల పీడీ నీలకంఠేశ్వరరావు మాట్లాడుతూ.. ఇటీవల జరిగిన జిల్లా స్థాయిలో ఎస్‌జీఎఫ్ అండర్-19 విభాగంలో సాఫ్ట్‌బాల్‌కు రోహిత్, మధులత, మేరీ, హర్షిత, భరత్, రిషిత్‌వర్మ, బేస్‌బాల్ పోటీలకు రోహిత్, మధులత, దేవలత, భరత్, జగన్‌మోహన్‌రెడ్డి, మేరీ, క్రికెట్ పోటీలకు సంధ్య, మమత, తైక్వాండోకు రోహిత్, భార్గవి, లహరి, తేజస్విని ఎంపికైనట్లు తెలిపారు. ఆయా క్రీడల్లో శిక్షణ ఇచ్చి రాష్ట్ర స్థాయి పోటీలకు సంసిద్ధం చేస్తున్నట్లు వివరించారు.

ఓబులవారిపల్లె: క్రీడా పోటీల్లో ఉత్తమ ప్రతిభ కనబరిచిన వారికే రాష్ట్ర స్థాయి జట్టులో అవకాశాలొస్తాయని వైకోట ప్రధానోపాధ్యాయుడు సయ్యద్ ఇక్బాల్, పీడీ అబ్దులా తెలిపారు. పుల్లంపేట ఆదర్శ పాఠశాలలో గురువారం నిర్వహించిన జిల్లా స్థాయి క్రీడల పోటీల్లో విజయం సాధించి.. రాష్ట్ర ఎస్‌జీఎఫ్ అండర్-19 సాఫ్ట్‌బాల్, బేస్‌బాల్ పోటీలకు ఎంపికయ్యారని చెప్పారు. ఆ విద్యార్థులకు శుక్రవారం అభినందన సభ ఏర్పాటు చేసి బహుమతులు అందజేశారు. రాష్ట్ర స్థాయిలో సాఫ్ట్‌బాల్ పోటీలకు వై.హరిబాబు, హేమంత్, బేస్‌బాల్ పోటీలకు మల్లికార్జున, రాజమౌళి ఎంపికైనట్లు తెలిపారు.



పోటీలకు ఎంపికైన పుల్లంపేట ఆదర్శ పాఠశాల విద్యార్థులతో ఉపాధ్యాయులు

మదనపల్లె
•మదనపల్లె •పీలేరు •తంబళ్లపల్లె

చెరువుకట్ట విస్తరణ పనులు ప్రారంభం

పెద్దమండ్యం, న్యూస్‌టుడే: మండలంలోని చెరువు కట్ట విస్తరణ పనులకు కలెక్టర్ చామకూరి శ్రీధర్ రూ.49 లక్షలు మంజూరు చేయడంతో తెదేపా మండలాధ్యక్షుడు విశ్వనాథరెడ్డి ఆధ్వర్యంలో శుక్రవారం భూమిపూజ చేసి పనులు ప్రారంభించారు. ఇటీవల కలెక్టర్ సందర్శించినప్పుడు నాయకులు, గ్రామస్థులు ఈ పనులు చేపట్టకపోవడంతో ఇబ్బందులు పడుతున్నామని వినతి పత్రం అందజేశారు. స్పందించిన ఆయన పీఆర్, ఇరిగేషన్, ఎన్ఆర్ఈజీఎస్ అధికారులకు ప్రతిపాదనలు పంపాలని ఆదేశించారు. ఈ మేరకు నిధులు మంజూరయ్యాయి. కార్యక్రమంలో మండల ప్రధాన కార్యదర్శి కాలేషా, మండల తెలుగు యువత అధ్యక్షుడు నార గంగాధర్, రైతువిభాగం అధ్యక్షుడు తుమ్మలమహేష్, నాగేశ్వర్‌రెడ్డి, సీతాపతిరెడ్డి, శ్రీనివాసులు, చంద్రారెడ్డి పాల్గొన్నారు.

రైతుల అభివృద్ధే ప్రభుత్వ లక్ష్యం


రైతులకు ఉలవలు పంపిణీ చేస్తున్న తెదేపా నాయకులు

ములకలచెరువు: రైతుల అభివృద్ధే లక్ష్యంగా ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు కృషి చేస్తున్నారని రాష్ట్ర బీసీ సెల్ అధికార ప్రతినిధి త్యాగరాజు, పారిశ్రామికవేత్త గిరిధర్ రెడ్డి అన్నారు. ములకలచెరువులో రైతులకు ప్రభుత్వం సబ్సిడీతో పంపిణీ చేస్తున్న ఉలవలను తెదేపా నాయకులు శుక్రవారం పంపిణీ చేశారు. వారు మాట్లాడుతూ గత వైకాపా ప్రభుత్వం అన్నదాతలను నిండా ముంచిదన్నారు. ఏవో లీలాకుమారి, మండల కన్వీనర్ రెడ్డెప్పరెడ్డి, నాయకులు సురేష్, నరసింహారెడ్డి, ప్రసాద్‌రెడ్డి, కేశవరెడ్డి, కేవీ.రమణ, శ్రీనివాసులు, మస్తాన్‌రెడ్డి, యర్రంరెడ్డి పాల్గొన్నారు.

మేమున్నాం... మీకు తోడుగా... (10 AM to 1 PM)
మదనపల్లె : 8008574611
పీలేరు : 8008574958
తంబళ్లపల్లె : 8008574612

స్పందనకు వందనం

మదనపల్లె గ్రామీణ: మండలంలోని కృష్ణాపురంలో గత కొన్నిరోజులుగా వీధి దీపాలు వెలగక మహిళలు, విద్యార్థులు రాత్రివేళల్లో ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఈనాడులో సమస్య ప్రచురితమైంది. గ్రామాధికారులు, విద్యుత్తు లైన్‌మ్యాన్ స్పందించి వీధి దీపాలకు మరమ్మతులు చేశారు.

❖ కొళ్లబైలు పంచాయతీ పరిధిలోని వైఎస్ఆర్ కాలనీలో చెత్తదిబ్బలు పేరుకుపోవడంతో కాలనీవాసులు ఇబ్బందులు పడుతున్నారని 'ఈనాడు'లో కథనం ప్రచురితమైంది. స్పందించిన సర్పంచి ఆనంద్‌రెడ్డి చెత్తదిబ్బలను సంపద కేంద్రాలకు తరలించారు.

❖ మదనపల్లె నుంచి చెంబకూరుకు వెళ్లే మార్గంలోని కాలనీలో మురుగుకాలువల్లోకి వ్యర్థాలను రహదారిపై ప్రవహిస్తుందని 'ఈనాడు'లో కథనం ప్రచురితమైంది. స్పందించిన ఎంపీడీవో భానుప్రసాద్, ఇన్‌ఛార్జి ఈవోపీఆర్డీ శ్రీహరి మురుగు ప్రవహించకుండా తాత్కాలిక ఐసుకట్టలను ఏర్పాటుచేశారు.

❖ మండలంలోని పోతబోలులోని మురుగు కాలువల్లో చెత్తచెదారం పేరుకుపోవడంతో ఈనాడులో సమస్య ప్రచురితమైంది. దీంతో పంచాయతీ అధికారులు స్పందించారు. పారిశుద్ధ్య పనులు చేపట్టారు.

ములకలచెరువు: నాయునిచెరువుపల్లి రోడ్డు పక్కన చెత్తచెదారంతో దుర్వాసన వ్యాపిస్తోందని ఈనాడులో సమస్య ప్రచురితమైంది. స్పందించిన పంచాయతీ కార్యదర్శి ఇబ్రహీం పంచాయతీ పారిశుద్ధ్య కార్మికులతో చెత్తను తొలగించారు.

❖ బి.కొత్తకోట నగర పంచాయతీ పరిధిలోని కరెంటు కాలనీ అంగన్‌వాడీ కేంద్రంలో దోమల బెడదపై ఈనాడులో సమస్య ప్రచురితమైంది. అధికారులు సమస్యను పరిష్కరించారు.

❖ బి.కొత్తకోట బాలికల ఉన్నత పాఠశాల వద్ద మురుగు, చెత్త పేరుకుపోయి బాలికలు ఇబ్బందులకు గురవుతుండడంతో ఈనాడులో సమస్య ప్రచురితమైంది. స్పందించిన నగర పంచాయతీ ఏఈ రాజశేఖర్ సమస్యను పరిష్కరించారు.

మదనపల్లె అర్బన్: విద్యుత్తు కార్యాలయ ఆవరణలో సిమెంటు పనులు ప్రతిపాదన చేసినట్లు ట్రాన్స్‌కో ఎగ్జిక్యూటివ్ ఇంజినీరు ఎం.గంగాధరం తెలిపారు. ఐదేకరాల ఆవరణలోని స్థలం సహా సిమెంటు రోడ్డు నిర్మాణంతో పాటు డివిజన్ కార్యాలయానికి కొత్తగా మెట్ల ఏర్పాటుకు చర్యలు తీసుకోనున్నామని తెలిపారు. ఆవరణలో శిథిలావస్థకు చేరిన పాత భవనం ఉండాల్సిన సీఎండీ దృష్టికి తీసుకెళ్లి చర్యలు తీసుకుంటామని తెలిపారు.

కంభంవారిపల్లి: మండలంలోని తీతమిగుంటపల్లె పంచాయతీ ఇర్రివాండ్లపల్లెలో తాగునీటి బోరు మరమ్మతుకు గురవడంతో ఈనాడులో కథనం ప్రచురితమైంది. స్పందించిన ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులు బోరు మరమ్మతు చేసి నీటి సౌకర్యం కల్పించారు.

పెద్దతిప్పసముద్రం : మండలంలోని కందుకూరులోని తేరు వీధిలో వీధి దీపాలు వెలగడం లేదని మంగళవారం ఈనాడులో కథనం ప్రచురితమైంది. స్పందించిన పంచాయతీ కార్యదర్శి మనోహర్ వీధిదీపాలకు మరమ్మతులు చేయించారు.

జగనన్న కాలనీలు... జనానికి కన్నీళ్లు

వెంటాడుతున్న మౌలిక వసతుల కొరత ● తాగునీరు లేక అవస్థలు


ఆయిల్‌ఫ్యాక్టరీ లేఅవుట్‌లో బురద రోడ్డులో రాకపోకలకు ఇబ్బంది పడుతున్న స్థానికులు

పీలేరు, న్యూస్‌టుడే: జగనన్న కాలనీల్లో లబ్ధిదారులు కష్టాలు పడుతున్నారు. ప్లాట్లు ఇచ్చాం... పాట్లు మీవన్న చందంగా మారిందని వారు వాపోతున్నారు. నియోజకవర్గ వ్యాప్తంగా 80 లేఅవుట్లు వేసి ప్లాట్లు కేటాయించినా ఇళ్లు మాత్రం 11,951 మందికే మంజూరు చేశారు. ఇంకా ప్లాట్లు ఇచ్చిన మూడు వేల మందికి మంజూరు కాలేదు. అంతలోనే ప్రభుత్వం మారడంతో పట్టాలు పొందిన వారికి ఇళ్లు ఎప్పుడిస్తారని ఆందోళన చెందుతున్నారు. ఇప్పటి వరకు 55 మంది ప్లాట్లు గుట్టలపై ఉన్నా నిర్మాణాలు ప్రారంభించలేదు. మిగిలిన 6,160 మంది నిర్మాణాలు పూర్తి చేయగా 545 మంది పైకప్పు వరకు, 1,102 మంది పక్క గోడలు, 111 మంది అర్ధఎత్తులో గోడలు కట్టారు. 3,321 మంది పునాదులు వేసినా తరువాత నిర్మాణాలు చేయలేదు.

సౌకర్యాలు కరవు : నియోజకవర్గంలో ఎక్కువగా పీలేరు మండలంలో 11వేల మందికి పట్టాలిచ్చినా 5,076 మందికి మాత్రమే ఇళ్లు మంజూరయ్యాయి. ఇంకా మదనపల్లె మార్గం జగనన్న లేఅవుట్-3, 4లో 3వేల మందికి ఇళ్లు మంజూరు చేయలేదు. సగం మందికి ప్లాట్లు చూపించలేదు. లేఅవుట్-3లో ప్లాట్లు అధికార పార్టీ అమ్ముకున్నారని ఫిర్యాదులు రావడంతో సార్వత్రిక ఎన్నికలప్పుడు నిర్మాణాలను రెవెన్యూ అధికారులు నిలిపేశారు. పీలేరు మండలంలో 600 మందికి ఇళ్లు ఇచ్చినా తిరుపతి మార్గంలోని లేఅవుట్‌లో కేవలం రెండు బోర్లు తవ్వించి మోటర్లు ఏర్పాటు చేసినా ఇళ్లకు గొట్టాలు విస్తరించలేదు. కాలనీ ఏర్పాటై ఐదేళ్లు పూర్తయినా ఇప్పటి వరకు ఆయిల్‌ఫ్యాక్టరీ లేఅవుట్ కాలనీ వీధి మధ్యలోని పెద్ద రాతిగుండును అధికారులు తొలగించలేదు. ఇక్కడ 1,200 ఇళ్లు మంజూరు చేసినా నీటి సౌకర్యం కల్పించలేదు. జలజీవన్ మిషన్‌లో ఇళ్లకు కుళాయిలు ఏర్పాటు చేస్తామని హామీ ఇచ్చినా ఇంకా కార్యరూపం దాల్చలేదు. దీంతో నిర్మాణాలు చేస్తున్నవారు, నివాసితులు అరకొర వసతులతో ఇబ్బందులు పడుతున్నారు. విద్యుత్తు శాఖ రూ.అయిదు కోట్లు వెచ్చించి స్తంభాలు, తీగలు లాగినా వీధిదీపాలు ఏర్పాటు చేయలేదు. విద్యుత్తు పనులకు గత ప్రభుత్వం ఒక్క రూపాయి కూడా మంజూరు చేయకపోవడంతో ఆ శాఖ విస్తరణలో జాప్యం చేస్తున్నారు. ప్రజాప్రతినిధులు, అధికారులు చర్యలు తీసుకుని కాలనీల్లో వసతులు కల్పించాలని కోరుతున్నారు.

నీళ్లకు ఇబ్బందిగా ఉంది



తిరుపతి మార్గంలోని లేఅవుట్‌లో 600 ఇళ్లకు రెండు బోర్లు తవ్వించి మోటర్లు ఏర్పాటు చేశారు. ఇప్పటి వరకు ఇళ్లకు ప్లాస్టిక్ గొట్టాలు ఏర్పాటు చేయలేదు. దీంతో బోర్ల వద్దకు వెళ్లి బిందెలతో నీళ్లు మోసుకుంటున్నాం. తాగునీటి క్యాన్‌కు రూ.15 చెల్లించి కొనుగోలు చేస్తున్నాం. **- ఎస్.సుజాత, తిరుపతి మార్గం అయిల్‌ఫ్యాక్టరీ లేఅవుట్, పీలేరు**

వీధి దీపాలు లేవు



600 ఇళ్లు మంజూరు చేయడంతో చాలా వరకు లబ్ధిదారులు నిర్మాణాలు చేశారు. వీధి దీపాలు ఏర్పాటు చేయకపోవడంతో రాత్రిపూట వీధుల్లోకి రావాలంటే కూడా భయపడుతున్నాం.
- యు.వంశీకుమార్, ఆయిల్ ఫ్యాక్టరీ లేఅవుట్, పీలేరు

ప్రతిపాదనలు పంపాం ; కాలనీలకు అవసరమైన మౌలిక వసతులపై ప్రతిపాదనలు ఏడాది కిందట పంపాం. అప్పటి నుంచి నిధులు రాక పనులు కార్యరూపం దాల్చలేదు. లబ్ధిదారులు ఇబ్బందులు పడుతున్నారు. మౌలిక వసతులపై ప్రస్తుత ప్రభుత్వం ద్వారా త్వరలో వసతులు సాకరమవుతాయి.
- బాలాజీ నాయక్, ఏఈ, గృహనిర్మాణశాఖ, పీలేరు

ఘనంగా ప్రపంచ పర్యాటక దినోత్సవం

కలికిరి,(వాల్మీకిపురం), న్యూస్‌టుడే: వాల్మీకిపురం పీవీసీ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో చిత్తూరు 35వ ఆంధ్రా బెటాలియన్ ఎన్‌సీసీ ఆధ్వర్యంలో ప్రపంచ పర్యాటక దినోత్సవం శుక్రవారం ఘనంగా నిర్వహించారు. పాఠశాల హెచ్‌ఎం రాలు సావిత్రి మాట్లాడుతూ.. యునెస్కో గుర్తింపు పొందిన వారసత్వ సంపద మన దేశం సొంతమని చెప్పారు. వాటి విశిష్టతను రక్షించడం మనందరి బాధ్యత అని తెలిపారు. అనంతరం విద్యార్థులకు నిర్వహించిన పోటీల్లో విజేతలకు బహుమతులు అందజేశారు. ఎన్‌సీసీ కేర్‌టేక్ ఆఫీసర్ రవీంద్రరెడ్డి, క్యాడెట్స్ పాల్గొన్నారు.

సచివాలయంలో చోరీ

బి.కొత్తకోట, న్యూస్‌టుడే: కొత్తగా నిర్మిస్తున్న బి.కొత్తకోట-1 సచివాలయ భవనంలో చోరీ జరిగినట్లు కాంట్రాక్టర్ డి.రామాంజులు శుక్రవారం స్థానిక పోలీసులకు ఫిర్యాదు చేశారు. మదనపల్లెరోడ్డులోని బత్తలాపురం క్రాస్ వద్ద సచివాలయ భవన నిర్మాణం పూర్తి కావస్తోంది. ఈ పనులకు నిల్వ చేసిన భవన నిర్మాణ సామగ్రి, విద్యుత్తు పరికరాలను గుర్తు తెలియని దుండగులు అపహరించుకుని వెళ్లడంతో తనకు నష్టం వాటిల్లినట్లు బాధితుడు ఫిర్యాదులో పేర్కొన్నారు.

పరిసరాల శుభ్రత తప్పనిసరి

కంభంవారిపల్లి, న్యూస్‌టుడే: పరిసరాల పరిశుభ్రత తప్పనిసరి అని గర్నిమిట్ట వైద్యాధికారిణి రేష్మ అన్నారు. మండలంలోని గర్నిమిట్ట కోళ్ల దుకాణందారులకు శుక్రవారం పలు సూచనలిచ్చారు. కోళ్ల వ్యర్థాలు వేయడంతో పారిశుద్ధ్యం లోపించిందని, ఊరికి దూరంగా వాటిని పడేయాలని కోరారు. పారిశుద్ధ్యం లోపించి, దోమలు వృద్ధి చెంది, వ్యాధులు ప్రబలే అవకాశం ఉందన్నారు. పంచాయతీ కార్యదర్శి సిగ్బతుల్లా, వైద్య సిబ్బంది పురుషోత్తం, రుక్మిణి తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు వ్యాసరచన పోటీలు

గుర్రంకొండ: ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపడుతున్న స్వర్ణాంధ్ర విజన్ 2047 సందర్భంగా స్థానిక జిల్లా పరిషత్తు ఉన్నత పాఠశాలలో శుక్రవారం మండల స్థాయి వక్తృత్వ, వ్యాసరచన పోటీలను నిర్వహించారు. ఆయా పాఠశాలలకు చెందిన 50 మంది విద్యార్థులు పోటీలో పాల్గొని తమ ప్రతిభ కనబరిచినట్లు ఎంఈవో2 సుబ్రహ్మణ్యం తెలిపారు. హెచ్‌ఎం ఖాజీఅహ్మద్‌బాషా, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

అభివృద్ధి పనులకు భూమి పూజ


రోడ్డు పనులకు భూమిపూజ చేస్తున్న ఎమ్మెల్యే షాజహాన్‌బాషా

మదనపల్లె గ్రామీణ, న్యూస్‌టుడే: గ్రామాల్లో రోడ్లు, మురుగు నీటి కాలువల సమస్యలు లేకుండా అభివృద్ధి పనులు చేపడతామని ఎమ్మెల్యే షాజహాన్ బాషా పేర్కొన్నారు. గ్రామీణ మండలం బాబుకాలనీ, వెంకటేశ్వరపురం, వన్నూర్‌సాబ్‌గుట్ట ప్రాంతాల్లో శుక్రవారం పలు సిమెంట్ రోడ్లు, మురుగునీటి కాలువల నిర్మాణానికి ఎమ్మెల్యే భూమి పూజచేశారు. ఆయన మాట్లాడుతూ రూ.50 లక్షలతో ఈ నిర్మాణాలు చేపడుతున్నామన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ప్రజా సంక్షేమానికి కృషి చేస్తున్నారన్నారు. అనంతరం పురపాలక సంఘం ఆధ్వర్యంలో నీరుగట్టువారిపల్లెలో చౌడేశ్వరీగుడి సమీపంలో ఎమ్మెల్యే మొక్కలు నాటారు. ప్రతిఇంటి ముందు ఒక్కో చెట్టు పెంచాలని కోరారు. ఎంపీడీవో భానుప్రసాద్, పంచాయతీరాజ్, సచివాలయ అధికారులు మున్సిపల్ కమిషనర్ ప్రమీల, కౌన్సిలర్ గాంధీ, నాయకులు హరికృష్ణా, నాందేళ్ల శివ, శ్రీనివాసులు, సంగం హరి, వేమయ్య, జాఫర్‌వునీస్సా పాల్గొన్నారు.

నిబంధనలతో క్వారీలకు అనుమతులు



మాట్లాడుతున్న డీఆర్వో సత్యనారాయణరావు, పక్కన కాలుష్య నియంత్రణ మండలి ఈఈ సుధ, తహసీల్దార్ ఖాజాబీ

మదనపల్లె గ్రామీణ, న్యూస్‌టుడే: ప్రజాభిప్రాయాలను దృష్టిలో పెట్టుకుని నిబంధనలతో క్వారీలకు అనుమతులిస్తామని డీఆర్వో సత్యనారాయణ పేర్కొన్నారు. కొత్తపల్లె, కొత్తవారిపల్లెల పరిధిలో ప్రైవేటు కంపెనీకు కలర్ గ్రానేట్ క్వారీ అనుమతుల నిమిత్తం ఏపీ కాలుష్యనియంత్ర మండలి ఆధ్వర్యంలో పర్యావరణ ప్రజాభిప్రాయ సేకరణ కార్యక్రమం శుక్రవారం నిర్వహించారు. కోటావారిపల్లెకు చెందిన రైతు గౌతం మాట్లాడుతూ క్వారీల్లో పురాతన పద్ధతులతో బ్లాస్టింగ్ చేస్తుండడంతో వ్యవసాయ బోర్లు పూడిపోతున్నాయన్నారు. ఎంపీటీసీ దేవేంద్ర మాట్లాడుతూ గతంలో క్వారీవారు ఇచ్చిన హామీలను నెరవేర్చలేదని, గ్రానేట్ రాళ్లు తీసుకెళ్తున్న లారీలతో గ్రామీణ రోడ్లు పూర్తిగా దెబ్బతిన్నాయని, వాతావరణ కాలుష్యం కారణంగా పంటపొలాలు దెబ్బతింటున్నాయని, నిబంధనల మేరకు స్థానికులకు ఉపాధి కల్పించడం లేదని అభిప్రాయాలు సేకరించి వెళ్లిపోతున్నారే తప్పా అమలుపై పర్యవేక్షణ లేదన్నారు. గ్రామాభివృద్ధికి అవసరమైన హామీలను అమలుచేసే విధంగా అధికారులు చర్యలు తీసుకోవాలని కోరారు. ఉపసర్పంచి నందకుమార్, ఏపీ కాలుష్య నియంత్రణ మండలి ఈఈ సుధా, గ్రామస్థులు తదితరులు పాల్గొన్నారు.

వైకాపా మదనపల్లె నియోజకవర్గ ఇన్‌ఛార్జికి నోటీసులు

మదనపల్లె విద్య, న్యూస్‌టుడే: మాజీ ముఖ్యమంత్రి జగన్ తిరుపతి పర్యటన సందర్భంగా వైకాపా నాయకులు అక్కడికి వెళితే ఉద్రిక్తత నెలకొంటుందని ముందస్తుగా మదనపల్లె పోలీసులు పట్టణంలోని వైకాపా నాయకులు, కౌన్సిలర్లకు శుక్రవారం నోటీసులిచ్చారు. ఇందులో భాగంగానే మదనపల్లె నియోజకవర్గ ఇన్‌ఛార్జి నిస్సార్‌అహ్మద్‌కు ఒకటోపట్టణ ఎస్ఐ అన్సర్‌బాషా, సిబ్బంది నోటీసులు అందజేశారు. ఇళ్లు వదలి వెళ్లకూడదని నోటీసులో పేర్కొన్నారు.

అనాథలకు అన్నదానం

మదనపల్లె విద్య, న్యూస్‌టుడే: దేవర సినిమా విజయవంతం కావాలని చైతన్య స్వచ్ఛంద సేవా సంస్థ ఆధ్వర్యంలో నడుస్తున్న పాఠశాల విద్యార్థులకు, అనాథ వృద్ధాశ్రమంలోని వృద్ధులకు ఎన్టీఆర్ అభిమాన సంఘం నాయకులు శుక్రవారం అన్నదానం చేశారు. సంస్థ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ కృష్ణచరణ్, ఫౌండర్, అధ్యక్షుడు ఎం.పి. ఆనంద్, కోశాధికారి గిరిజమ్మల్, ఎన్టీఆర్ అభిమానులు వెంకటేష్, దిలీప్, వినోద్, మహేష్, ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

పర్యాటక కేంద్రాలను పరిరక్షించుకోవాలి

నిమ్మనపల్లె, న్యూస్‌టుడే: పర్యాటక కేంద్రాలను, సంపదను కాపాడుకోవాల్సిన బాధ్యత ప్రజలదేనని అందుకు విద్యార్థులు సన్నద్ధం కావాలని నిమ్మనపల్లె జడ్పీఉన్నత పాఠశాల హెచ్‌ఎం అంజాద్‌అలీ ఖాన్ అన్నారు. ప్రపంచ పర్యాటక దినోత్సవం సందర్భంగా ఆ పాఠశాల ఎన్‌సీసీ విద్యార్థులకు పర్యాటక ప్రాంతాలు సంస్కృతి సాంప్రదాయాలపై శుక్రవారం అవగాహన కల్పించారు. ఎన్‌సీసీ సీటీవో వెంకటగోపాల్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

భగత్‌సింగ్ జీవిత చరిత్రను పాఠ్యపుస్తకాల్లో చేర్చాలి

మదనపల్లె విద్య, న్యూస్‌టుడే: భగత్‌సింగ్ జీవిత చరిత్రను పాఠ్యపుస్తకాల్లో చేర్చాలని ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాల ప్రిన్సిపల్ బాలకృష్ణమూర్తి కోరారు. కళాశాలలో ఏపీ స్టూడెంట్ జేఏసీ ఆధ్వర్యంలో భగత్ సింగ్ జయంతి వారోత్సవాల్లో భాగంగా విద్యార్థులకు అవగాహనా కార్యక్రమంతో పాటు వ్యాసరచన పోటీలు శుక్రవారం నిర్వహించారు. విజేతలకు బహుమతులు అందజేశారు. జయంతి ఉత్సవాలు ఈనెల 28న తిరుపతి ఎస్వీయూలో జరగనున్నాయన్నారు. సీనియర్ న్యాయవాది సోమశేఖర్, ఫోర్డు సంస్థ డైరెక్టర్ లలితమ్మ, ఎన్ఎస్ఎస్ అధికారి రెడ్డెప్పరెడ్డి, అధ్యాపకుడు సాయిశేఖర్‌రెడ్డి, ఏపీస్టూడెంట్ జేఏసీ రాష్ట్ర కార్యదర్శి ఉత్తన్న, జిల్లా అధ్యక్షుడు టి.గంగరాజుతో పాటు విద్యార్థులు పాల్గొన్నారు.

విద్యార్థులకు రక్త పరీక్షలు

కలకడ, న్యూస్‌టుడే: మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలోని ఇంటర్ విద్యార్థులకు ఎన్ఎస్ఎస్ యూనిట్ ఆధ్వర్యంలో కలకడ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్య సిబ్బంది శుక్రవారం రక్తపరీక్షలు నిర్వహించారు. కమ్యూనిటీ హెల్త్ అధికారి ప్రత్యూష, ల్యాబ్‌టెక్నీషియన్ హాజరై కళాశాలలోని 120 మంది విద్యార్థులకు రక్త పరీక్షలు చేశారు. ప్రిన్సిపల్ జయభారతి, వైస్‌ప్రిన్సిపల్ రమణయ్య, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం అధికారి పుష్పకుమారి, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

మొదటి వారంలో వేతనాలు చెల్లించాలి

మదనపల్లె గ్రామీణ, న్యూస్‌టుడే: మొదటి వారంలోనే వేతనాలు చెల్లించాలని హమాలీ వర్కర్సు యూనియన్ నాయకులు నరసింహులు, అయూబ్ డిమాండు చేశారు. పౌరసరఫరాల సంస్థ గిడ్డంగి ఎదుట శుక్రవారం మూడోరోజు ఏఐటీయూసీ ఆధ్వర్యంలో వారు నిరసన చేశారు. వారు మాట్లాడుతూ ఈ ఏడాది జనవరి 1 నుంచి కొత్త కూలీ రేట్లను పెంచి అమలు చేయాల్సిన పౌరసరఫరాల సంస్థ, ప్రభుత్వం ఇప్పటి వరకు ఎలాంటి జీవోను విడుదల చేయకుండా కాలయాపన చేస్తుందని, 9 నెలలు కావస్తున్నా హమాలీలకు కూలి ధరలు పెంచకపోవడం శోచనీయమన్నారు. ఏఐటీయూసీ నాయకులు దేవా, తిరుమల, హమాలీ నాయకులు విజయ్‌కుమార్, ముబారక్, నదీమ్, దిలీప్, మస్తాన్ తదితరులు పాల్గొన్నారు.

పెరిగిన కూలిరేట్లనూ...

బి.కొత్తకోట : పౌర సరఫరాల హమాలీలకు పెరిగిన కూలి రేట్లను చెల్లించాలని ఏఐటీయూసీ తంబళ్లపల్లె నియోజకవర్గ అధ్యక్ష, కార్యదర్శులు ఎస్.సలీంబాషా, బి.వేణుగోపాల్‌రెడ్డి డిమాండు చేశారు. బి.కొత్తకోట పౌరసరఫరాల గోదాం వద్ద హమాలీలు నిరసన కార్యక్రమాన్ని శుక్రవారం నిర్వహించారు. పౌరసరఫరాలశాఖ జిల్లా డీఎం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని, కొత్త హమాలీలకు పీఎఫ్ కార్డులు ఇవ్వలేదని వారు వాపోయారు. యూనియన్ నాయకులు షఫీ, ఫకృద్దీన్, జయరాం, లక్ష్మన్న, వెంకటరమణ తదితరులు పాల్గొన్నారు.



నినాదాలు చేస్తున్న హమాలీలు

జిల్లా నెట్‌బాల్ జట్టు ఎంపిక


జిల్లా నెట్‌బాల్ జట్టుకు ఎంపికైన క్రీడాకారులతో పీఈటీ

మదనపల్లె విద్య, న్యూస్‌టుడే: ఉమ్మడి చిత్తూరు జిల్లా అండర్ 17 బాలబాలికల జిల్లా జట్లు ఎంపిక శుక్రవారం సీటీఎం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో నిర్వహించారు. ఈ పోటీలకు 150 మంది క్రీడాకారులు పాల్గొన్నట్లు ఎస్‌జీఎఫ్ కార్యదర్శి వసంత తెలిపారు. ఇక్కడ ఎంపికయ్యే క్రీడాకారులు త్వరలో జరిగే రాష్ట్ర స్థాయి పోటీలకు వెళతారన్నారు. బాలికల జట్టుకు చంద్రకళ, జనవి, భీష్మ, సింధు, సంధ్య, గోమతి, వర్షి, నిర్మల, అమ్ములు, వాణిశ్రీ, గ్రీష్మ, స్టాండ్‌బైలుగా తన్వీక, శృతి, రమ్య, శైలజలు ఎంపికయ్యారు. బాలుర జట్టుకు మునిమోహిత్, హేమంత్‌నాయక్, రామ్, అభిలాష్, ధనుష్, సాయిప్రకాష్, సంతోష్‌రెడ్డి, జకిఉల్లా, భవనేష్, భరత్, మౌనిశ్వర్, రెడ్డిశేఖర్, స్టాండ్‌బైలుగా చరణ్, తేజ, వాసు, సతీష్‌లు ఎన్నికయ్యారు. జిల్లా ఎస్‌జీఎఫ్ అసిస్టెంట్ కార్యదర్శి నాగరాజు, ఉపాధ్యాయులు గిరిధర్‌నాయక్, ఉమర్‌బాషా, పీఈటీ నరేష్‌బాబు, సుధాకర్, గోపికృష్ణ, మణి, ఉమ, కిరణ్, రెడ్డికిరణ్, రెడ్డిప్రసాద్, లోకనాథం, క్రిస్టి, యూసుఫ్, రియాజ్ తదితరులు పాల్గొన్నారు.

మదనపల్లె విద్య : మండలంలోని ఆవులపల్లె ప్రాథమికోన్నత పాఠశాల విద్యార్థులు మొట్టమొదటి సారిగా జిల్లాస్థాయి పోటీలకు ఎంపికైనట్లు పాఠశాల హెచ్‌ఎం రవికుమార్, స్కూల్ కమిటీ ఛైర్మన్ చెన్నకేశవు తెలిపారు. అండర్ 14 కబడ్డీ పోటీల్లో ఏడో తరగతి విద్యార్థిని శైలజ, వాలీబాల్ పోటీల్లో నందకిశోర్ ప్రతిభ కనబరిచారన్నారు. ఏడుగురు విద్యార్థులు పాల్గొనగా ఇద్దరు ఎంపికయ్యారని తెలిపారు. ఉపాధ్యాయులు మురళి, జయరాం, శ్రీరాములు వారిని అభినందించారు.


ఎంపికైన విద్యార్థులతో ఉపాధ్యాయులు

తిరుమలలో రాజకీయాలు చేస్తే జగన్‌కు మూల్యం తప్పదు


తహసీల్దార్ నిర్మలాదేవికి వినతిపత్రం అందిస్తున్న భాజపా జిల్లా ఉపాధ్యక్షుడు కృష్ణమూర్తి, నాయకులు

రామసముద్రం, న్యూస్‌టుడే: తిరుమల కొండపై రాజకీయాలు చేయాలని మాజీ సీఎం జగన్ చూస్తే తగిన మూల్యం తప్పదని భాజపా జిల్లా ఉపాధ్యక్షుడు కృష్ణమూర్తి హెచ్చరించారు. రామసముద్రం తహసీల్దార్ కార్యాలయంలో శుక్రవారం భాజపా నాయకులు తహసీల్దార్ నిర్మలాదేవికి, పోలీసుస్టేషన్‌లో వినతిపత్రాలు సమర్పించారు. తిరుమలకు వచ్చే జగన్ డిక్లరేషన్‌పై సంతకం చేసి స్వామి దర్శనానికి వెళ్లాలని డిమాండు చేశారు. నాయకులు ఆనంద్‌కుమార్‌నాయుడు, శేఖర్, సుబ్రహ్మణ్యం, రాజశేఖర్ పాల్గొన్నారు.

మదనపల్లె ఆర్టీవో బాధ్యతల స్వీకరణ

మదనపల్లె గ్రామీణ : ఆర్టీవోగా ప్రతాప్‌రావు స్థానిక ఎంవీఐ కార్యాలయంలో శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. కోనసీమలో పనిచేస్తున్న ప్రతాప్‌రావును మదనపల్లెకు తొలి ఆర్టీవోగా ప్రభుత్వం నియమించింది. ఆయన్ను యూనిట్ అధికారి దినేష్‌చంద్ర, కార్యాలయ సిబ్బంది కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు. ఆయన మాట్లాడుతూ ఇక నుంచి మదనపల్లె డివిజన్‌లోని 11 మండలాలకు సంబంధించిన ట్రాన్స్‌పోర్టు సేవలను ఇక్కడి నుంచే అందించనున్నట్లు చెప్పారు. ప్రస్తుతం ఆన్‌లైన్ అనుసంధానమని, త్వరలో అందుబాటులోకి తీసుకొస్తామన్నారు.

బడ్జెట్ ప్రణాళికకు గ్రామసభలు

రామసముద్రం, న్యూస్‌టుడే: గ్రామీణ ఉపాధి హామీ పథకంలో 2025-26 ఆర్థిక సంవత్సరానికి గ్రామపంచాయతీ స్థాయిలో పనుల మంజూరు, బడ్జెట్ ప్రణాళిక రూపకల్పనకు వచ్చే నెల 2న గ్రామసభలు నిర్వహించనున్నట్లు ఏపీఎం గౌరీశంకర్ శుక్రవారం తెలిపారు. నవంబరు 10వ తేదీ వరకు క్షేత్రస్థాయిలో పర్యటించి పనులను సమగ్రంగా ప్రణాళికలో రూపొందించాలని కోరారు. దీనికోసం ఓ కమిటీని నియమిస్తున్నామన్నారు. నవంబరు 30వ తేదీకి మండల బడ్జెట్ నమూనాను తయారు చేసి ప్రభుత్వానికి పంపాల్సి ఉంటుందని చెప్పారు.

పోషకాహారంతోనే ఆరోగ్యం

కలికిరి, న్యూస్‌టుడే: పోషకాహారంతోనే ఆరోగ్యమని ఐసీడీఎస్ సీడీపీవో భారతి తెలిపారు. కలికిరి మండలం పల్లవోలు అంగన్‌వాడీ కేంద్రంలో పోషకాహార మాసోత్సవం సందర్భంగా శుక్రవారం జరిగిన సమావేశంలో ఆమె గర్భిణులు, బాలింతలకు పౌష్టికాహారంపై అవగాహన కల్పించారు. కలికిరి ఎమ్మార్సీ కార్యాలయ సమావేశ భవనంలో జరిగిన పోషకాహార మాసోత్సవంలో తహసీల్దారు మహేశ్వరీబాయి, వెలుగు ఏపీఎం దేవసేనా, సూపర్‌వైజర్ అరుంధతి, ప్రధానోపాధ్యాయుడు మురాష తదితరులు పాల్గొన్నారు.

నాణ్యమైన భోజనం అందించాలి

ముదివేడు (కురబలకోట), న్యూస్‌టుడే: పాఠశాలల్లో విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించాలని హైస్కూలు కమిటీ ఛైర్మన్ బాబాజాన్ సూచించారు. ముదివేడు హైస్కూల్లో మధ్యాహ్న భోజనాన్ని శుక్రవారం తనిఖీ చేశారు. భోజనం సక్రమంగా ఉంటేనే విద్యార్థులకు ఆరోగ్యమని, బాధ్యతగా పనిచేయాలని సిబ్బందికి సూచించారు. హైస్కూల్లోని సమస్యల్ని హెచ్‌ఎం సుబ్రహ్మణ్యాన్ని అడిగి తెలుసుకున్నారు. నాయకులు అయూబ్ బాష, పంచాయతీ కార్యదర్శి రామప్పనాయుడు తదితరులు పాల్గొన్నారు.

మంచి, చెడు స్పర్శలపై అవగాహన

కలికిరి, (వాల్మీకిపురం) న్యూస్‌టుడే: కిశోర బాలికలు మంచి, చెడు స్పర్శలపై అవగాహన కలిగి ఉండాలని హెల్త్ ఎడ్యుకేటర్ మహమ్మద్ రఫీ సూచించారు. స్థానిక జిల్లా పరిషత్తు ఉన్నత పాఠశాల, జూనియర్ కళాశాలలో జిల్లా వైద్యఆరోగ్యశాఖ అధికారుల ఆదేశాల మేరకు విద్యార్థినులకు గుడ్, బ్యాడ్ టచ్‌లు, బాల్యవివాహాలు, వ్యాధులు, టోల్‌ఫ్రీ నంబర్స్, పౌష్టికాహారంపై అవగాహన కల్పించారు. ప్రిన్సిపల్ శ్రీదేవి మాట్లాడుతూ.. ఎవరైనా అసభ్యంగా ప్రవర్తిస్తే అప్రమత్తమవ్వాలన్నారు. టీబీ పర్యవేక్షకులు నాగిరెడ్డి, ఎంఎల్‌హెచ్‌పీ అమృత, అధ్యాపకులు, ఉపాధ్యాయులు, ఆశాకార్యకర్తలు పాల్గొన్నారు.


ర్యాలీ నిర్వహిస్తున్న విద్యార్థులు, వైద్య ఆరోగ్య సిబ్బంది

IN THE COURT OF THE Addl. SENIOR CIVIL JUDGE : MADANAPALLE

I.P.No. 27 OF 2024

Petitioner : Smt. K.Kavitha, W/o K.Devendra, aged about 35 years, Hindu, residing at D.No.1-587-A, B.T. College Road, Madanapalle Town and Mandal, Annamayya District, Aadhaar Card : 709151878122

//Versus//

Respondents:
1. Sri M.Siva Prasad, S/o M.Venkat ramana, aged about 60 years, Hindu, residing D.No.14-71, Venkateswar Street, CTM Road, Cell: 9440466457.
2. Sri M.Tirumala, S/o Timumala Appaiah, aged about 45 years, Hindu, residing at D.No.16-527-3-A-1, Nimmanapalle Road, Cell : 9440353177
3. Smt. B.Bharathi, W/o B.Raja, aged about 40 years, Hindu, residing at D.No.7-25, Ravindra Nagar, Eguva Kuravanka, H/o Ponnutipalem, Cell : 7989603350
4. Smt. N.Shakunthala, W/o N.Reddeppa Reddy, aged about 55 years, Hindu, residing at D.No.2-535, Kuravanka, Cell : 9440254233
5. Smt A.Vanisree, W/o Sreenivasulu, aged about 37 years, Hindu, residing at D.No.2-327, Ramalayam Colony Road, Cell : 9908327444
6. Smt. O.Kamalamma, W/o G.Ramesh Babu, aged about 45 years, Hindu, residing at D.No. 1-705-A, Gandhipuram, Cell : 9989598135
7. Sri N.Sharada, W/o N.Dilip Kumar, aged about 40 years, Hindu, residing at Kuravanka, H/o Ponnutipalem, Cell : 9505240164
8. Sri R.Surendra, S/o Chennayya, aged about 55 years, Hindu, residing at D.No.9-86-4, Sivapriya Nagar, Ponnutipalem Post. Cell: 6309898681
9. Sri Rupesh, Father's Name not known, aged about 42 years, Hindu, residing Ramalayam Street, Madanapalle Town and Mandal, Cell : 7005171044
10. Sri B.Lakshmi Narasimhulu, S/o B.Nadipi Narasimhulu, aged about 40 years, Hindu, residing at D.No. 3-2, Reddies Colony, Respondents 1 to 10 belongs to Madanapalle Town and Mandal, Annamayya District.
11. Sri R.Anjineyulu, S/o R.Siddappa, aged about 38 years, Hindu, residing at D.No.6-1, Sreeramulavaripalle Village, Cell : 9581110563
12. Smt E.Jyothi, W/o Nageswara, aged about 38 years, Hindu, residing D.No.10-12, Cell : 9581110563 Respondents 11 and 12 are residing at Sreeramulavaripalle Village, Thettu Post, Kurabalakota Mandal, Annamayya District.
13. Sri K.Muralikrishna, S/o Venkata swamy, aged about 39 years, Hindu, residing at D.No.10-46, Majjigavandla palle Village, H/o Medikurthi Post, Kalikiri Mandal, Cell : 7660070781, Annamayya District.
14. Smt P.Hemavathi, W/o P.Sankarappa, aged about 30 years, Hindu, residing at D.No.8-25, Kolimipalle Village, H/o Kagathi, Chowdepalle Mandal, Chittoor District. Cell : 7794022343
15. Sri K.Raja Venkatappa, S/o K.Valeppa, aged about 45 years, Hindu, residing at D.No.9-2, Tekupalle Village, Chembakuru Post, Ramasamudram Mandal, Cell : 9908655847, Annamayya District.
16. Sri V.Jayasakar Vijaya, S/o Venkataramana, aged about 33 years, residing at D.No.12-122A, T.Harijanawada, H/o Punganur Rural, Chittoor District, Cell : 9550350950
17. Smt G.Reddemma, W/o Raghu natha Reddy, aged about 39 years, Hindu, residing at D.No.407, CRPE, Quarters, Nagenahalli, Bangalore - 560064, Cell : 9663526431
18. Sri B.Eswara Naik, S/o Seve Naik, aged about 40 years, Hindu, residing at Diguvathanda, Kotakonda Village, H/o Kotakonda, Cell : 9441844583
19. Sri S.Manohar Reddy, S/o S.Reddeppa Reddy, aged about 48 years, Hindu, residing at D.No.2-27, Kukkarajupalle Village and Post, Cell : 9398571717

Respondents 18 and 19 belongs to Thamballapalle Mandal, Annamayya District.

NOTICE TO RESPONDENTS 1 TO 19

The petitioner has filed the above Insolvency petition, praying the Hon'ble Court to adjudge her as Insolvent due to inability to repay the debts owned to the respondents. This matter is scheduled, for hearing on 04.11.2024. You are required here either in person or through an Advocate on that date and time to your present your case and filed any objections you may have, the hearing will take place before the Hon'ble Court at 10.30 AM. Please be advise that if you fails to appear and submit your objections, the Court may be proceed with case in your absence and you may be declare as ex-parte.

// By the Order of Court//

Sri D.Krishna Reddy, Sri S.Gaffar Saheb,
Advocates, Madanapalle, Cell : 9440582838

రాయచోటి
• రాయచోటి • రాజంపేట • రైల్వేకోడూరు

బాలికోన్నత పాఠశాల తనిఖీ


మధ్యాహ్న భోజనం రుచి చూస్తున్న జేసీ ఆదర్శ్ రాజేంద్రన్

చిన్నమండెం, న్యూస్‌టుడే: చిన్నమండెం బాలికోన్నత పాఠశాలను జేసీ ఆదర్శ్ రాజేంద్రన్ తనిఖీ చేశారు. ఈ సందర్భంగా విద్యార్థినులతో సమస్యల గురించి మాట్లాడారు. అక్కడే ఉన్న ఫిర్యాదుల పెట్టెను తెరిపించి పరిశీలించారు. అనంతరం మధ్యాహ్న భోజనం చేశారు. బాలికల భద్రతపై హెచ్‌ఎం రమాదేవి, ఎంఈవో ఆంజనేయులునాయుడుకు పలు సూచనలు చేశారు. అనంతరం తహసీల్దారు కార్యాలయాన్ని, పౌరసరఫరాల గోదామును తనిఖీ చేశారు. తహసీల్దారు నరసింహులు, మండల అధికారులు పాల్గొన్నారు.

తెదేపా రాష్ట్ర అధ్యక్షుడిని కలిసిన నాయకులు

రాజంపేట, న్యూస్‌టుడే: తెదేపా రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాసయాదవ్‌ని విజయవాడలో శుక్రవారం రాజంపేట పార్లమెంట్ లీగల్ సెల్ అధ్యక్షుడు టి. లక్ష్మీనారాయణ, మాజీ గ్రామీణాధ్యక్షుడు బాసినేని వెంకటేశ్వర్లునాయుడు, విశ్రాంత పీడీ షామీర్‌బాషా తదితరులు కలిశారు. రాజంపేటకు సంబంధించిన పలు విషయాలను ఆయన దృష్టికి తీసుకెళ్లామని.. ఆయన సానుకూలంగా స్పందించినట్లు లీగల్ సెల్ అధ్యక్షుడు లక్ష్మీనారాయణ తెలిపారు.


తెదేపా రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాస్‌యాదవ్‌తో రాజంపేట నాయకులు

? : స్థానిక బస్టాండ్ ఆవరణలో కొన్ని రోజులుగా చెత్త నిల్వలు పేరుకుపోయాయి. దీంతో దుర్వాసన వెదజల్లుతోంది.
- స్థానికులు, ఆర్టీసీ బస్టాండ్, వీరబల్లి

✔ : వెంటనే హరిత రాయబారులను పంపించి బస్టాండ్ ఆవరణ, పరిసరాలను శుభ్రం చేయిస్తాం. .
- వరప్రసాద్, కార్యదర్శి, వీరబల్లి - వీరబల్లి, న్యూస్‌టుడే

? : మండల కేంద్రంలోని ప్రయాణ ప్రాంగణం వద్ద కాలువలో మురుగుతో పాటూ వ్యర్థాలు పేరుకుపోయి దోమలు వృద్ధి చెందుతున్నాయి సమస్య లేకుండా చూడాలి. **- బాషా, స్థానికుడు**

✔ : వెంటనే పారిశుద్ధ్య సిబ్బందిని పంపించి కాలువల్లో పూడిక తొలగింపజేస్తాం. దోమల నివారణకు చర్యలు చేపడతాం.
- ఎం.సుదర్శన్‌రెడ్డి, పంచాయతీ కార్యదర్శి, లక్కిరెడ్డిపల్లె
- లక్కిరెడ్డిపల్లె, న్యూస్‌టుడే

నచ్చిన భోజనం... మెచ్చిన జనం

అన్న క్యాంటీన్లలో రుచికరమైన ఆహారం

కూటమి ప్రభుత్వంపై పేదల హర్షాతిరేకాలు


రాయచోటి, రామాపురం, న్యూస్‌టుడే: పేద వర్గాలు, దినసరి కూలీలు, కార్మికుల కడుపు నింపేందుకు రాష్ట్ర ప్రభుత్వం రూ.5కే అన్న క్యాంటీన్లలో రుచికరమైన భోజనం అందిస్తోంది. 2014-19 మధ్యలో తెదేపా ప్రభుత్వం అక్షయ పాత్ర సహకారంతో పేదల ఆకలి తీర్చేలా వీటిని ఏర్పాటు చేసింది. వైకాపా అధికారంలోకి వచ్చాక తొలగించింది. గత ఎన్నికల హామీల అమలులో భాగంగా కూటమి ప్రభుత్వం ఆగస్టు 16న రాష్ట్ర వ్యాప్తంగా అన్న క్యాంటీన్లను తిరిగి ప్రారంభించింది. ఈ క్రమంలో రాయచోటి పట్టణంలోని ప్రభుత్వాసుపత్రి ఆవరణలో ఈ నెల 23 నుంచి అన్న క్యాంటీన్ వినియోగంలోకి తెచ్చారు. శుక్రవారం పలువురు పేదలు లైన్‌లో నిల్చుని క్షుద్బాధ తీర్చుకున్నారు. ● ఏదైనా హోటల్‌కు వెళ్లి భోజనం చేయాలంటే ప్లేట్ రూ.70, కడుపు నిండా తినాలంటే రూ. 100 ఖర్చు చేయాలి. ఇంత మొత్తం చెల్లించలేని కూలీలు, నిరుపేదలు కడుపు నిండా భోజనం చేయలేని పరిస్థితి ఉండేది. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక నిరు పేదల ఆకలి తీర్చేందుకు అన్న క్యాంటీన్లను ప్రారంభించడంతో రూ.5లకే రుచికరమైన భోజనం చేస్తున్నారు. రాయచోటిలో మొదటి విడతగా ప్రభుత్వాసుపత్రి ఆవరణలో ఈ నెల 23వ తేదీ రవాణా, యువజన, క్రీడల శాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి కలెక్టర్ శ్రీధర్‌తో కలిసి ప్రారంభించారు. క్యాంటీన్‌కు సమీపంలో ఆర్టీసీ బస్టాండ్, ఆసుపత్రి ఉండటంతో రోజూ వెయ్యి మందికి పైగా ఆకలి తీర్చుకుంటున్నారు. వీరందరికీ కూటమి నాయకులు, కార్యకర్తలు సొంత నిధులతో ఉచితంగానే భోజనం అందించేలా చూస్తున్నారు. మంత్రి రాంప్రసాద్‌రెడ్డి సైతం నవంబర్ నుంచి ఏడాది పాటు తన సొంత నిధులతో పేదలకు ఉచితంగా భోజనం అందిస్తామని హామీ ఇచ్చారు. అక్షయ పాత్ర ట్రస్టు వారు మెనూ ప్రకారం ఉదయం టిఫిన్, మధ్యాహ్నం, రాత్రి భోజనంలో ఒక కర్రి, సాంబారు, పెరుగు అందిస్తున్నారు.

ఆప్యాయంగా పలకరిస్తున్నారు

మాది లక్కిరెడ్డిపల్లె మండలం. వ్యక్తిగత పనులపై రాయచోటికి వచ్చా. మధ్యాహ్నానికి పని కాకపోవడంతో అన్న క్యాంటీన్‌కు వచ్చా. భోజనం వడ్డించే సిబ్బంది ఎంతో ఆప్యాయంగా పలకరిస్తున్నారు. భోజనం ఎంతో రుచిగా ఉంది. ఆకలితో ఉన్న పేదలకు పట్టెడన్నం పెట్టాలనే ప్రభుత్వ నిర్ణయం హర్షణీయం. **- వెంకటరమణ, లక్కిరెడ్డిపల్లె**



తృప్తిగా తింటున్నాం



నేను బేల్దారి పనులకు వెళ్తూ జీవనం సాగిస్తున్నా. రోజూ మధ్యాహ్నం భోజనం చేయాలంటే కనీసం రూ. 70 ఖర్చయ్యేది. అన్న క్యాంటీన్ పుణ్యమాని కడుపునిండా తృప్తిగా తింటున్నా. కౌంటర్‌లో రూ.5 ఇవ్వబోతే స్థానిక కూటమి నాయకులు మా బదులు ఇస్తున్నారని చెప్పారు. ఉచితంగా రుచికరమైన ఆహారం అందిస్తున్న ప్రభుత్వానికి రుణపడి ఉంటాం.
- వెంకటరమణ, బేల్దారి కూలీ, దుద్యాల, సంబేపల్లె మండలం

నాణ్యమైన భోజనం పెట్టారు



అనారోగ్యంతో బాధ పడుతూ నా కుమారుడితో కలిసి ఆసుపత్రికి వచ్చా. కూలి పనులకు వెళ్లి జీవనం సాగిస్తున్నా. నా వద్ద డబ్బులు తక్కువగా ఉండటంతో అన్న క్యాంటీన్‌కు వచ్చి తిన్నాం. ఉచితంగా నాణ్యమైన భోజనం పెట్టారు. ఏ ప్రభుత్వమైనా ఇలాంటి పథకాలు పెడితే మా లాంటి వారికి ఎంతో ఉపయుక్తంగా ఉంటుంది. **- నాగమ్మ, వీరబల్లి మండలం**

సొంత క్లినిక్‌లలో ప్రభుత్వ వైద్యుల సేవలు

రాయచోటి గ్రామీణ, న్యూస్‌టుడే: జిల్లాలో పని చేస్తున్న కొంత మంది ప్రభుత్వ వైద్యులు తమ పని గంటల సమయంలో వైద్యశాలలో అందుబాటులో లేకుండా వారి సొంత క్లినిక్‌లలో ఉంటున్నారని.. అలాంటి వారిపై చర్యలు తీసుకోవాలంటూ సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు సిద్ధిగాళ్ల శ్రీనివాసులు డిమాండు చేశారు. ఈ మేరకు జిల్లా వైద్య సహాయాధికారి విష్ణువర్ధన్‌రెడ్డికి సీపీఐ నాయకులు శుక్రవారం వినతి పత్రం ఇచ్చారు. ప్రభుత్వ వైద్యశాలలకు వచ్చిన రోగులను సైతం సొంత క్లినిక్‌లకు సిఫారసు చేసి రోగులను దోచుకుంటున్నారని విమర్శించారు.

స్వేచ్ఛాపూరిత ఉపాధ్యాయ బోధనకు అవకాశం కల్పించాలి

సుండుపల్లి, న్యూస్‌టుడే: ప్రభుత్వాలు ఏవైనా ఉపాధ్యాయులకు పనిభారం పెంచుతున్నాయని ఎస్టీయూ జిల్లా అధ్యక్షుడు శివారెడ్డి పేర్కొన్నారు. మండలంలోని మడితాడు, జి.కె.రాచపల్లి, సుండుపల్లి తదితర పాఠశాలలో సంఘ మండల నాయకులతో కలసి శుక్రవారం సభ్యత్వ నమోదు కార్యక్రమం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ.. బోధనేతర పనులు పూరించమని అధికారులు ఒత్తిడి చేయడం సరైన విధానం కాదన్నారు. పీఆర్సీ, ఐఆర్ తదితర బకాయిల విడుదలపై ప్రభుత్వం దృష్టిసారించేలా సంఘాలు కృషి చేస్తాయన్నారు.

సమస్యలు పరిష్కరించాలని హమాలీల నిరసన


రాజంపేటలో ఆందోళన చేస్తున్న ఏఐటీయూసీ నాయకులు, హమాలీలు

రాజంపేట, న్యూస్‌టుడే: హమాలీలు ఎదుర్కొంటున్న సమస్యలను అధికారులు పరిష్కరించాల్సిందేనని ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి సాంబశివ డిమాండు చేశారు. స్థానిక సివిల్ సప్లై గోదాము వద్ద శుక్రవారం ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ హమాలీలకు క్వింటాకు రూ.30 చెల్లించాలన్నారు. ప్రతి నెలా 18 తేదీ వరకు కూడా వారికి వేతనాలు ఇవ్వడంలేదని.. ఈ విషయంలో అధికారులు నిర్లక్ష్యం వహిస్తున్నారని ఆరోపించారు. ఏఐటీయూసీ జిల్లా ఉపాధ్యక్షుడు ఎం.ఎస్.రాయుడు, పట్టణ కార్యదర్శి సికిందర్, హమాలీల సంఘ నాయకులు సూరి, రాఘవేంద్ర తదితరులు పాల్గొన్నారు.

కార్యకర్తలను అధిష్ఠానం గుర్తించాలి

రైల్వేకోడూరు, న్యూస్‌టుడే: తెదేపా కోసం కష్టపడిన కార్యకర్తలను అధిష్ఠానం గుర్తించాలని ఆ పార్టీ రాజంపేట పార్లమెంటు ఉపాధ్యక్షుడు పుల్లెల రమేషబాబు పేర్కొన్నారు. స్థానిక పార్టీ కార్యాలయంలో శుక్రవారం ఆయన మాట్లాడుతూ ముఖ్యమంత్రి చంద్రబాబు నామినేటెడ్ పోస్టుల భర్తీ ప్రక్రియలో పార్టీ కోసం అహర్నిశలు కష్టపడిన వారిని గుర్తించాలని కోరారు. కష్టకాలంలో పార్టీకి అండగా నిలబడిన వారికి పదవులు కేటాయించాలన్నారు. నాయకులు ఈశ్వరయ్యనాయుడు, శ్రీధర్, వెంకటయ్య, సురేష్, శివయ్యనాయుడు, కరిముల్లా పాల్గొన్నారు.

డిక్లరేషన్‌లో సంతకం పెట్టలేకనే మాజీ సీఎం పర్యటన రద్దు


మాట్లాడుతున్న భాజపా రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు పోతుగుంట రమేష్‌నాయుడు

రాజంపేట, న్యూస్‌టుడే: తిరుమల దర్శనానికి వస్తానని చెప్పి తీరా డిక్లరేషన్‌లో సంతకం పెట్టాలని డిమాండు చేయడంతో తన పర్యటననే మాజీ సీఎం జగన్‌మోహన్‌రెడ్డి రద్దు చేసుకున్నారని భాజపా రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు పోతుగుంట రమేష్‌నాయుడు విమర్శించారు. స్థానిక పార్టీ కార్యాలయంలో శుక్రవారం ఆయన మాట్లాడుతూ అయిదేళ్ల వైకాపా పాలనలో రాష్ట్రంలో హిందూ సమాజాన్ని దారుణంగా దెబ్బతీశారని ఆరోపించారు. తిరుమలకు అన్యమతస్తులు ఎప్పుడు వచ్చిన డిక్లరేషన్ చేయాలనే నిబంధన ఎప్పటి నుంచో ఉందని.. దాన్ని గడిచిన అయిదేళ్లలో తుంగలో తొక్కిన జగన్‌మోహన్‌రెడ్డి ఇప్పుడు అలాగే చేయాలని చూస్తే కుదరదన్నారు.

పోరాటాలతోనే హక్కుల సాధన


యువతను పార్టీలోకి ఆహ్వానిస్తున్న వ్యకాస నాయకులు

రైల్వేకోడూరు, న్యూస్‌టుడే: ప్రస్తుత ప్రభుత్వాల పనితీరులో ప్రజలు తమ హక్కులు సాధించుకోవాలన్నా.. సమస్యలు పరిష్కరించుకోవాలన్నా పోరుబాట పట్టడం తప్ప వేరే మార్గం లేదని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు పందుగోల మణి, ప్రధాన కార్యదర్శి తోపు కృష్ణప్ప పేర్కొన్నారు. స్థానిక సీపీఐ కార్యాలయంలో శుక్రవారం వారి ఆధ్వర్యంలో సమావేశం ఏర్పాటు చేశారు. 60 మంది కార్యకర్తలను పార్టీలో చేర్చుకున్నారు. ప్రజా సమస్యల పరిష్కారానికి యంత్రాంగం సంసిద్ధంగా లేదన్నారు. పోరాటాలతోనే ఇవన్నీ సాధించుకోవాలని వివరించారు. పార్టీ నాయకులు ప్రసాద్, వినయ్, నరసయ్య, రమణయ్య, వెంకటేశ్వర్లు, సుబ్బరాయుడు పాల్గొన్నారు.

అధికారులతో న్యాయమూర్తి సమీక్ష


మాట్లాడుతున్న మూడో అదనపు జిల్లా న్యాయమూర్తి దీనబాబు

రాజంపేట, న్యూస్‌టుడే: రాజంపేట న్యాయస్థానం ఆవరణలో చేపట్టే వివిధ పనులపై సంబంధిత అధికారులు, న్యాయవాదులతో మూడో అదనపు జిల్లా న్యాయమూర్తి దీనబాబు సమీక్ష నిర్వహించారు. రాజంపేటకు కొత్తగా మంజూరైన జూనియర్ సివిల్ జడ్జి న్యాయస్థానం నిర్వహణ కోసం అక్కడే ఉన్న తహసీల్దారు కార్యాలయాన్ని స్వాధీనం చేసుకునే విషయంలో సంబంధిత రెవెన్యూ అధికారులతో చర్చించారు. మహిళ న్యాయవాదులు, వివిధ ప్రాంతాల నుంచి వచ్చే ప్రజల కోసం కోర్టు ప్రాంగణంలో మరుగుదొడ్లు, తాగునీటి బోరు కోసం స్థలాన్ని పరిశీలించి సంబంధిత అధికారులతో మాట్లాడారు. కార్యక్రమంలో బార్ అసోసియేషన్ అధ్యక్షుడు సయ్యద్ నాసరుద్దీన్, కార్యదర్శి చంద్రశేఖర్, ఏజీపీ గురుప్రతాప్‌రెడ్డి, ఏపీపీ షేక్ నిజాం జానీ పాల్గొన్నారు.

గొల్లపల్లిలో దొంగల హల్‌చల్

నందలూరు, న్యూస్‌టుడే: మండలంలోని నాగిరెడ్డిపల్లి గ్రామ పంచాయతీ పరిధిలోని గొల్లపల్లిలో శుక్రవారం తెల్లవారుజాము గుర్తు తెలియని వ్యక్తులు గ్రామంలోని గోసి ప్రసాద్, గోపినేని కొండయ్య, గొబ్బిళ్ల మల్లికార్జున, ఆనందిరమాదేవిలకు చెందిన నాలుగు ఇళ్లలో చోరీలకు పాల్పడ్డారు. వీటిలో మూడు నివాసాలకు తాళం వేసి ఉండగా.. ఆనంది రమాదేవి అనే మహిళ ఇంట్లో ఒంటరిగా ఉండగా ఇంటి తలుపును గునపాలతో బలంగా పగలగొట్టే ప్రయత్నం చేయడంతో ఆమె కేకలు వేయడంతో చుట్టు పక్కల వారు వచ్చే సరికి పరారయ్యారని బాధితురాలు పోలీసులకు ఫిర్యాదు చేశారు. మన్నూరు సీఐ బి.వి.కృష్ణయ్య, నందలూరు ఎస్ వెంకటేశ్వర్లు దర్యాప్తు చేస్తున్నారు.

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

సుండుపల్లి, న్యూస్‌టుడే: సుండుపల్లికి చెందిన సుబ్బరామ రాజు (64) తిరుపతి రుయా ఆసుపత్రిలో చికిత్స పొందుతూ శుక్రవారం మృతి చెందినట్లు ఎస్సై శ్రీనివాసులు తెలిపారు. శ్వాస కోశ వ్యాధులతో బాధపడుతూ.. ఈ నెల 13న గుంతరాచపల్లి సమీపంలోని మామిడి తోటకు వెళ్లి పురుగు మందు తాగారు. చికిత్స నిమిత్తం ఆసుపత్రికి తీసుకెళ్లగా చికిత్స పొందుతూ మృతి చెందారని ఆయన భార్య ఇచ్చిన ఫిర్యాదుతో కేసు నమోదు చేశామన్నారు.

అగ్ని ప్రమాదాలపై అప్రమత్తత అవసరం

లక్కిరెడ్డిపల్లె, న్యూస్‌టుడే: అగ్ని ప్రమాదాలపై ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండాలని అగ్నిమాపక కేంద్ర బాధ్య అధికారి రామయ్య పేర్కొన్నారు. మండలంలోని గ్లోబల్ పాఠశాలలో శుక్రవారం విద్యార్థులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ పాఠశాలలో జరిగే ప్రమాదాలను ఎలా జాగ్రత్తలు తీసుకోవాలో విన్యాసాల ద్వారా అవగాహన కల్పించారు. కరస్పాండెంట్ దాక్షాయిని, ఉపాధ్యాయులు, సిబ్బంది పాల్గొన్నారు.

తహసీల్దార్ల బాధ్యతల స్వీకరణ


షేక్ పీర్‌మున్నీ


శ్రీధర్‌రావు

రాజంపేట గ్రామీణ, ఓబులవారిపల్లె, న్యూస్‌టుడే: రాజంపేట మండల తహసీల్దారుగా షేక్ పీర్‌మున్నీ శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. ఓబులవారిపల్లె నుంచి ఇక్కడికి బదిలీపై వచ్చారు. ఓబులవారిపల్లె తహసీల్దారుగా శ్రీధర్ రావు బాధ్యతలు చేపట్టారు. ఈయన బి.కొత్తకోట నుంచి బదిలీపై వచ్చారు. వీరికి రెవెన్యూ సిబ్బంది స్వాగతం పలికారు. వారు మాట్లాడుతూ ప్రజలకు అందుబాటులో ఉంటూ రెవెన్యూ సమస్యలు పరిష్కరించేందుకు కృషి చేస్తామన్నారు.

పీడీఎస్‌యూది 50 ఏళ్ల చరిత్ర


పీడీఎస్‌యూ కరపత్రాలు ఆవిష్కరిస్తున్న ఆ సంఘ నాయకులు

రాజంపేట, న్యూస్‌టుడే : 1974లో పురుడు పోసుకున్న పీడీఎస్‌యూకు 50 ఏళ్ల చరిత్ర ఉందని. . ఈ కాలంలో విద్యార్థి, ప్రజల సమస్యలతో పాటు సామాజిక అంశాలపై ఎన్నో పోరాటాలు చేశామని, ఎన్నో విజయాలను అందుకున్నామని ఆ సంఘ జిల్లా నాయకులు పృథ్వీ, సాధిక్ తెలిపారు. ఈ మేరకు 50 ఏళ్ల ఉత్సవాలకు సంబంధించిన కరపత్రాలను శుక్రవారం రాజంపేటలో వారు ఆవిష్కరించారు. సంఘ నాయకులు సోమశేఖర్‌రాజు, సాయిరామ్, లోకేశ్వర్, వెంకటవర్ధన్‌రెడ్డి పాల్గొన్నారు.

ప్రభుత్వ భూములు పేదలకు పంచాలి

పుల్లంపేట, న్యూస్‌టుడే: అన్యాక్రాంతమైన ప్రభుత్వ భూములను పేదలకు పంచి పెట్టాలని బీకేఎంయూ జిల్లా అధ్యక్షుడు పండుగోల మణి పేర్కొన్నారు. స్థానిక తహసీల్దారు కార్యాలయంలో శుక్రవారం డీటీ లక్ష్మీప్రసన్నకు పేదలకు భూములు పంచాలని వినతి పత్రం అందించారు. ప్రభుత్వ బంజరు భూములను ఆక్రమించుకుని అనుభవిస్తున్న వారి నుంచి స్వాధీనం చేసుకుని దళితులు, గిరిజనులకు పంపిణీ చేయాలన్నారు. బీకేఎంయూ నాయకులు సేలం కుమార్, రమణయ్య, లక్ష్మయ్య, కృష్ణవేణి, రవి పాల్గొన్నారు.


డీటీ లక్ష్మీప్రసన్నకు వినతి పత్రం అందిస్తున్న బీకేఎంయూ నాయకులు

ఎమ్మెల్యే గృహ నిర్బంధం

రాజంపేట గ్రామీణ, న్యూస్‌టుడే: రాజంపేట ఎమ్మెల్యే ఆకేపాటి అమరనాథ్‌రెడ్డిని ఇంటి నుంచి బయటకు రాకుండా శుక్రవారం మన్నూరు పోలీసులు అడ్డుకున్నారు. తిరుమల శ్రీవారి లడ్డూ వ్యవహారంలో వివాదం జరుగుతున్న నేపథ్యంలో మాజీ సీఎం జగన్‌మోహన్ రెడ్డి తిరుమలకు వచ్చి శ్రీవారిని దర్శించుకోవాలని నిర్ణయించడంతో ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా ముందస్తుగా ఆయన్ను గృహ నిర్బంధం చేశారు.

సత్తా చాటిన కేజీబీవీ విద్యార్థినులు

లక్కిరెడ్డిపల్లె, న్యూస్‌టుడే: మండల కేంద్రంలోని కసూర్బా పాఠశాలకు చెందిన విద్యార్థినులు రాష్ట్ర స్థాయి క్రీడలకు ఎంపికైనట్లు ప్రిన్సిపల్ నాగలక్ష్మి పేర్కొన్నారు. పాఠశాలలో శుక్రవారం విద్యార్థినులకు అభినందన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. అండర్-19 ఈత పోటీల్లో బుజ్జి, కర్రన్స్, అండర్-14 రాష్ట్రస్థాయి క్రీడలకు ప్రమీల, పుట్‌బాల్, శిరీష హాకీ క్రీడలకు ఎంపికయ్యారన్నారు. ధనలక్ష్మి అథ్లెటిక్స్, వైష్ణవి రన్నింగ్‌లో శిరీష, భవిత, జిల్లాస్థాయికి ఎంపికైనట్లు తెలిపారు. ఉపాధ్యాయులు, విద్యార్థినులు పాల్గొన్నారు.



విద్యార్థినులతో ప్రిన్సిపల్ నాగలక్ష్మి

మానవత విలువలతో సమాజ స్థాపన

సిద్దవటం, న్యూస్‌టుడే : బాల్య దశ నుంచే విద్యార్థులు మానవత, నైతిక విలువలు పెంపొందించుకుని భవిష్యత్తులో సమాజ శాంతి స్థాపనకు కృషి చేయాలని కేంద్ర నియంత్ర కమిటీ జిల్లా డైరెక్టర్లు రాటాల గోపి, రామాంజనేయులరెడ్డి తెలిపారు. సిద్దవటం మండలం టక్కోలు జడ్పీ ఉన్నత పాఠశాలలో శుక్రవారం మానవత సేవా సంస్థ ఆధ్వర్యంలో సమాజం-నైతిక విలువలు అంశంపై పాఠశాల హెచ్‌ఎం ఉమామహేశ్వరుడు అధ్యక్షతన అవగాహన సదస్సు నిర్వహించారు. మానవత సేవా సంస్థ ప్రతినిధులు సుబ్బరాయుడు, బొడిచెర్ల వెంకట సుబ్బరాయుడు, అవ్వారు సుబ్బయ్య, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

మళ్లీ పగిలిన శ్రీరామ ఎత్తిపోతల పైప్‌లైను


కోటపాడు సమీపంలో పైపులైను దెబ్బతినడంతో ఏర్పడిన గుంత

ఒంటిమిట్ట, న్యూస్‌టుడే : ఒంటిమిట్ట శ్రీరామ ఎత్తిపోతల పథకం పైపులైను పగిలిపోయింది. శుక్రవారం సాయంత్రం విద్యుత్తు సరఫరాలో అంతరాయం ఏర్పడడంతో మోటారు ఆగిపోయింది. అనంతరం విద్యుత్తు రావడంతో సిబ్బంది మోటారు వేసిన కాసేపటికి పైపులు ఒత్తిడికి గురయ్యాయి. కోటపాడు కనుమ దిగువ ప్రాంతంలో పైపులు దెబ్బతిన్నాయి. దీంతో సోమశిల వెనుక జలాలు వృథాగా పోతున్నాయి. రెండు వారాల తర్వాత పగిలిపోవడంతో ఎత్తిపోతల నిలిచింది. వెంటనే బాగు చేయించాలని కర్షకులు కోరుతున్నారు.

ఒంటిమిట్టకు హరిత శోభ తీసుకొస్తాం

ఒంటిమిట్ట, న్యూస్‌టుడే : ఒంటిమిట్ట కోదండ రామాలయం పరిసర ప్రాంతాలు, కల్యాణ వేదిక ప్రాంగణంలో హరిత శోభ తీసుకురావడానికి ప్రణాళికను రూపొందించినట్లు తితిదే పాలక మండలి డిప్యూటీ ఈవో, రామయ్య క్షేత్రం ప్రత్యేకాధికారిణి ప్రశాంతి పేర్కొన్నారు. ఏకశిలానగరిలో జగదభిరాముడిని శుక్రవారం దర్శించారు. ఇప్పటికే ఉన్న ఉద్యాన వనాలను పరిశీలించారు. తితిదే, నరేగా సంయుక్త నిధులతో మర్రి, రావి, జువ్వి తోపాటు ఇతర రకాలను నాటించాలని గుంతలను తవ్విస్తున్నట్లు వివరించారు. ఏపీవో శివశంకర్‌రెడ్డి పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి క్రీడాపోటీలకు విద్యార్థుల ఎంపిక


రాష్ట్ర స్థాయి జట్టుకు ఎంపికైన విద్యార్థులతో అధ్యాపకులు

వీరబల్లి, న్యూస్‌టుడే: జిల్లాలో ఎస్‌జీఎఫ్ అండర్-19 పోటీలలో వీరబల్లి ప్రభుత్వ జూనియర్ కళాశాల విద్యార్థులు రాష్ట్ర స్థాయి జట్టుకు ఎంపికైనట్లు ప్రిన్సిపల్ అంజంతుల్లా తెలిపారు. ఏపీ మోడల్ స్కూల్‌లో జరిగిన ఈ పోటీలలో రాష్ట్ర స్థాయి జట్టుకు డి.గిరివర్ధన్, వి.రామ్‌చరణ్, పి.,తోఫిక్ అలీఖాన్‌లు, సాఫ్ట్‌బాల్‌లో పి.మహీధర్, సి.తిరుమల, బేస్‌బాల్‌లో పి.మహీధర్, ఎస్.అఫ్జల్‌లు ఎంపికైనట్లు తెలిపారు. వీరిని కళాశాల అధ్యాపకులు, ఎన్‌ఎస్‌ఎస్ పీవోలు రఘురామయ్య, భాస్కర్‌లు శుక్రవారం అభినందించారు.



పుల్లంపేట : రాష్ట్ర స్థాయి క్రికెట్, సాఫ్ట్‌బాల్, బేస్‌బాల్ క్రీడా పోటీలకు కొత్తపేట ఉన్నత పాఠశాల విద్యార్థి **హర్ష** ఎంపికైనట్లు ప్రధానోపాధ్యాయుడు మల్లికార్జున, పీడీ బాలశేఖర్ తెలిపారు. ఇటీవల ఎస్‌జీఎఫ్ అండర్-19 విభాగంలో పుల్లంపేట ఆదర్శ పాఠశాలలో జిల్లా జట్ల ఎంపిక జరిగింది. ఈ పోటీల్లో ఉత్తమ ప్రతిభ చూపిన హర్ష మూడు క్రీడలకు ఎంపికైనట్లు వారు తెలిపారు.

జిల్లా స్థాయి క్రీడలకు.. : చిన్నమండెం: మండల పరిధిలోని మల్లూరు ఉన్నత పాఠశాలకు చెందిన 23 మంది విద్యార్థులు ఎస్‌జీఎఫ్ జిల్లా స్థాయి పోటీలకు ఎంపికైనట్లు హెచ్‌ఎం రెడ్డెన్న, పీడీ రామచంద్రలు తెలిపారు. ఈ నెల 23 నుంచి మూడు రోజుల పాటు రాయచోటి పట్టణంలోని మాసాపేటలో జరిగిన పోటీల్లో ఉత్తమ ప్రతిభ కనపరిచి ఎంపికయ్యారన్నారు. అండర్-14 పరుగులో సంధ్య, సుప్రజ, వాసవి, అమృత, లాంగ్‌జంప్‌లో సుప్రజ, బాలుర పరుగు విభాగంలో భరత్, బాలచౌడయ్య, లాంగ్‌జంప్‌లో భరత్, సాహిత్ చందు, అండర్-17 కబడ్డీలో వెంకటశివ, వాలీబాల్‌లో గణేష్ జిల్లా స్థాయి క్రీడలకు ఎంపికయ్యారన్నారు.


ఎంపికైన విద్యార్థులతో హెచ్‌ఎం, పీడీ, ఉపాధ్యాయులు